# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 18 సంచిక: 350 | ఆదివారం, 17 ఆగస్ట్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com




## నేటి నుంచి బీహార్‌లో రాహుల్ యాత్ర

'ఓటర్ అధికార్ యాత్ర' పేరుతో..
16 రోజులు.. 24 జిల్లాల్లో పర్యటన
బీహార్‌లో మొదలైన ఎన్నికల సమరం
ఎన్డీఏ, ఇండియా కూటమీ పార్టీల వ్యూహం
అధికారం చేజిక్కించుకోడాన్ని ప్రణాళికలు

02



## పదవులు, పైసలూ మీకేనా?

సొంత పార్టీపై విరుచుకుపడ్డ మునుగోడు ఎమ్మెల్యే
వందసార్లు తిరిగినా బిల్లులు రాలేదు
సీఎంను ప్రశ్నించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

02

# కాళేశ్వరంను కూళేశ్వరం అన్నారు



## పోలవరంను 'కూలవరం' అనే దమ్ముందా?

మేడిగడ్డలో రెండు పిల్లర్లకు పగుళ్లు వచ్చాయి
పోలవరం కాఫర్ డ్యాం రెండుసార్లు కొట్టుకుపోయింది
అయినా ఎన్డీఎస్ఏ మౌనంగా ఉంది
కేసీఆర్‌పై బీజేపీ, కాంగ్రెస్ చేస్తున్న కుట్ర
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు దెబ్బతింటే 'కూలేశ్వరం' అంటూ విమర్శలు గుప్పించిన కాంగ్రెస్, బీజేపీ నేతలకు, ఇప్పుడు రెండోసారి కాఫర్ డ్యామ్ కొట్టుకుపోయిన పోలవరం ప్రాజెక్టును 'కూలవరం' అని నిందించే ధైర్యం ఉందా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. ప్రాజెక్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వం, జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్డీఎస్ఏ) పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో మేడిగడ్డ వద్ద చిన్న సమస్య తలెత్తగానే, 24 గంటల్లోపే ఎన్డీఎస్ఏను రంగంలోకి దించి బీఆర్ఎస్‌పై బురదజల్లే ప్రయత్నం చేశారని కేటీఆర్ ఆరోపించారు. కానీ, సాక్షాత్తూ ఎన్డీఏ ప్రభుత్వం నిర్మిస్తున్న జాతీయ ప్రాజెక్టయిన పోలవరం కాఫర్ డ్యామ్ రెండోసారి దెబ్బతిన్నా కేంద్ర సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయని ఆయన నిలదీశారు. ఆంధ్రప్రదేశ్‌లో 10 అడుగుల వెడల్పు, 8 అడుగుల లోతు మేర కాఫర్ డ్యామ్ కొట్టుకుపోతే, యుద్ధప్రాతిపదికన ..మిగతా 4లో



## టిబి నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలి

తెలంగాణ ట్యూబర్ క్యూలోసిస్ చెస్ట్ డిసిసెస్ కాన్ఫరెన్స్2025 ప్రారంభోత్సవ కార్యక్రమం
ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
గవర్నర్ కు స్వాగతం పలికిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, చేవెళ్ళ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్, ఆగస్టు 16 (ప్రజాస్వరం):**

తెలంగాణా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ వికారాబాద్ జిల్లా అనంతగిరి పర్యాటక కేంద్రాన్ని శనివారం సందర్శించారు. రాష్ట్ర తెలంగాణా సభా పతి గడ్డం ప్రసాద్ కుమార్, చేవెళ్ళ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్ పి నారాయణ రెడ్డి లు పూల మొక్కలు అందజేసి గవర్నర్ గవర్నర్కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తెలంగాణా రాష్ట్ర గవర్నర్ పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. ట్యూబర్ క్యూలోసిస్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో అనంతగిరి హిల్స్ హరిత రిసార్ట్స్ లో ఏర్పాటు చేసిన మూడవ తెలంగాణ ట్యూబర్ క్యూలోసిస్ ..మిగతా 4లో



## 2040 వరకు రాజకీయాల్లో ఉంటా..

రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం
ఆ దిశగానే విజన్ 2047
తెలంగాణ కవులకు, పోరాటానికి స్ఫూర్తినిచ్చిన గడ్డ
ఉద్యమంలో ప్రజలకు స్ఫూర్తిగా నిలిచిన కవులు
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
అందెశ్రీ రచించిన పుస్తకం ఆవిష్కరణ

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

2040 వరకు క్రియాశీలక రాజకీయాల్లో ఉంటానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కళ్యాణ్‌నగర్ టీజీ జెన్కో ఆడిటోరియంలో ప్రముఖ కవి అందెశ్రీ రచించిన హసిత భాష్పాలు పుస్తకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ..మిగతా 4లో

## నేరం అంగీకరించిన నమ్రత

*1998లో మొదటిసారి విజయవాడలో ఫెర్టిలిటీ సెంటర్*
*2007లో సికింద్రాబాద్‌లో రెండో బ్రాంచ్ ఓపెన్*
ఒక్కో జంట నుంచి 20—-30 లక్షలు వసూలు
అబార్షన్ కోసం వచ్చిన దంపతులు టార్గెట్
కన్ఫెషన్ రిపోర్ట్‌లో సంచలన విషయాలు



02

## భారీ వర్షం.. అల్లకల్లోలం

సంగారెడ్డి, మెదక్ జిల్లాలో కుండపోత
పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
పలు చోట్ల చెరువులకు గండ్లు
రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలకు రెడ్ అలర్ట్



02



## మహిళాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)
మహిళా సంఘాలకు రూ. 26 వేల కోట్ల రుణాలు
వికారాబాద్ జిల్లా, చేవెళ్ల నియోజకవర్గం నవాబు పేట్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

02



## అమెరికాకు కల్వకుంట్ల కవిత పయనం

శంషాబాద్ ఎయిర్ పోర్టులో సెండాఫ్ ఇచ్చిన భర్త
చిన్న కుమారుడు ఆర్యను కాలేజీలో చేర్పించేందుకు అమెరికాకు
15 రోజుల పాటు అమెరికా పర్యటనలోనే కవిత

02

## పెన్షన్ పెంచుతావా గద్దె దిగుతావా?



రాష్ట్రంలోని పింఛన్ దారులను సర్కార్ మోసం చేస్తోంది
20 నెలలు దాటినా పెంచిన పింఛన్ అమలు చేయరా?
ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇంకెప్పుడు నెరవేరుస్తారు
సీఎం రేవంత్‌రెడ్డికి మంద కృష్ణ మాదిగ వార్నింగ్

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని పింఛన్ దారులను మోసగిస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మండిపడ్డారు. వికారాబాద్ జిల్లా పరిగి లో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలు, ఆసరా పింఛన్ రూ.4 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని.. 20 నెలలు దాటినా అమలు చేయట్లేదని విమర్శించారు. పింఛన్‌దారులకు నెలకు రూ. వెయ్యి కోట్ల చొప్పున అందాల్సి ఉంటే.. ఇప్పటివరకు రూ.20 వేల కోట్లు పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ..మిగతా 4లో

# 2040 వరకు రాజకీయాల్లో ఉంటా..

మొదటిపేజీ తరువాయి

ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సమాజం కవులకు, పోరాటానికి స్ఫూర్తినిచ్చిన గడ్డ అని అన్నారు. ఉద్యమంలో ప్రజలకు స్ఫూర్తిగా గూడ అంజన్న, దశరథి, కాళోజీ, అందెశ్రీ, గద్దర్, గోరెటి వెంకన్న లాంటి కవులు నిలిచారని గుర్తు చేశారు. తనపై తనకు సంపూర్ణ నమ్మకం కలిగించి, కార్యోన్ముకిన్ని చేసి యుద్ధ రంగానికి సిద్ధం చేసిన వ్యక్తి శ్రీకృష్ణుడు అని అన్నారు. తాను కొంచెం ఓపెన్‌గా మాట్లాడుతానని, ఎక్కువ టైమ్ రాజకీయ కార్యక్రమాలకు ఇస్తానని, ఎందుకుంటే అక్కడ తాము మాట్లాడేదే ఫైనల్ ఉంటుందన్నారు. కానీ ఈ పుస్తకావిష్కరణలకు రావాలంటే పదంపదం ప్రిపేర్ అయ్యి రావాలని అన్నారు. అసలైన ఉద్యమకారులు ఎవరు కూడా తాము ఉద్యమకారుణ్ణి అని చెప్పుకోలేదని, కొద్ది మంది ఉద్యమకారులని చెప్పుకునే వాళ్లకి టీవీలు, పేపర్లు, వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో తనకు అర్థం కావడం లేదన్నారు. కొందరు గాలికి అనుకూలంగా ప్రణాళికలు వేసుకుని, దేశానికి నాయకత్వం వహించాలనే దురాశతో తెలంగాణ పేరు, పేగు బంధాన్ని తెంచుకున్నారని అన్నారు. తాను ఎవరిని కూడా శత్రువుగా చూడనని, తాను శత్రువుగా చూడాలంటే వాళ్లకు స్థాయి ఉండాలని అన్నారు. జెడ్పీటీసీ నుంచి ఈ స్థాయికి వచ్చానని, ఇంత గొప్ప అవకాశాన్ని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఇచ్చారని అన్నారు. ఇలాంటి గొప్ప అవకాశాన్ని, తనకు వాళ్ల మీద ప్రయోగిస్తే తనకంటే మూర్ఖుడు మరోకరు ఉండరని అన్నారు. తాను కర్మసిద్ధాంతాన్ని నమ్ముతానని, వాళ్ల పాపాన వాళ్లేపోతారని భావిస్తానన్నారు. తన గెలుపేతో గిట్టని వాళ్లకు దుఃఖం వచ్చిందని, తాను సంతకం పెడుతుంటే వాళ్లకు గుండెల్లో రాసినట్టు అయ్యిందని అన్నారు. అందాల పోటీల్లప్పుడు 109 దేశాల సుందరీమణులతో జయ జయహే తెలంగాణ పాటను పాడించామని, వాళ్లను తెలంగాణ తల్లి ముందు మొకరించామని అన్నారు. కట్టడాలు ఎవరైనా కట్టొచ్చని, అందమైన భవనాలు అభివృద్ధి కాదని, పేదలకు సొంత ఇళ్లు ఇచ్చి ఆత్మగౌరవం నిలబెడుతున్నామని అన్నారు. ఒకనాడు సీఎంను చూడాలంటే గొప్ప సన్నివేశం. కానీ ఇప్పుడు ఎప్పుడైనా, ఎవరైనా కలవచ్చని అన్నారు. తాను జెడ్పీటసీ అయినప్పుడు కౌన్సిల్ లేదని, జడ్పీటీసీ కాగానే కౌన్సిల్ వచ్చిందని, తర్వాత ఎమ్మెల్సీ అయ్యానని, తెలంగాణకి రెండో సీఎం అయ్యానని అన్నారు. 2040 వరకు క్రియాశీలక రాజకీయాల్లో ఉంటానని సీఎం అన్నారు.

# పెన్షన్ పెంచుతావా గద్దె దిగుతావా?

మొదటిపేజీ తరువాయి

అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా నెరవేర్చడం లేదన్నారు. తీవ్ర వైకల్యం కలిగిన కండరాల క్షీణత ఉన్న వ్యాధిగ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలని మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. అధికార పక్షం అన్యాయం చేస్తుంటే ప్రతిపక్షం నోరు విప్పడం లేదన్నారు. తెలంగాణలో చేయూత ద్వారా పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారులను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా లబ్ధిదారులకు నాలుగు వేల రూపాయలు చెల్లిస్తామని.. ఆ తర్వాత విస్మరించిందన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు ఉన్న చిత్తశుద్ధి రేవంత్ రెడ్డికి లేదన్నారు. నవంబర్ మొదటివారంలో పెన్షన్ తో పాటు పది నెలల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెంచిన పెన్షన్లు ఇవ్వకపోతే దివ్యాంగుల సమాజ చేయుత దారులందర్నీ మరో ఉద్యమానికి మానసికంగా సిద్ధం చేయడానికి ఎమ్మార్పీఎస్ బాధ్యత తీసుకుంటుందని హెచ్చరించారు. నవంబర్ 26న పెన్షన్ దారుల పోరాట దినంగా ప్రకటించి.. దివ్యాంగులు, చేయూత పెన్షన్ దారులతో చలో హైదరాబాద్ కు పిలుపునిస్తామన్నారు. ఇందిరా పార్క్ దగ్గర ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

# కాళేశ్వరంను 'కూలేశ్వరం' అన్నారు

మొదటిపేజీ తరువాయి

గుట్టుచప్పుడు కాకుండా మరమ్మతులు చేస్తున్నారని అన్నారు. అదే సమయంలో, తెలంగాణలో 20 నెలలు గడుస్తున్నా మేడిగడ్డ వద్ద కనీస మరమ్మతు పనులు కూడా చేపట్టకపోవడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి మూర్ఖత్వమే కారణమని విమర్శించారు. కాళేశ్వరంకు ఒక నీతి... పోలవరంకు మరో నీతా? అని మండిపడ్డారు. గతంలో 2020లో పోలవరం డయాఫ్రం వాల్ కొట్టుకుపోయినా, తెలంగాణలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలి 8 మంది ప్రాణాలు కోల్పోయినా ఎన్డీఎస్ఏ స్పందించలేదని కేటీఆర్ గుర్తుచేశారు. ఇది కేవలం ప్రాజెక్టుల సమస్య కాదని, తెలంగాణ రైతాంగానికి జీవనాధారమైన కాళేశ్వరంపై, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్, బీజేపీలు కలిసి చేస్తున్న రాజకీయ కుట్ర అని ఆయన ఆరోపించారు. తెలంగాణ వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా నిలిచిన కాళేశ్వరం ప్రాజెక్టును కంటికి రెప్పలా కాపాడుకుంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# భారీ వర్షం.. అల్లకల్లోలం

- సంగారెడ్డి, మెదక్ జిల్లాలో కుండపోత
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- పలు చోట్ల చెరువులకు గండ్లు
- రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలకు రెడ్ అలర్ట్



తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

తెలంగాణాలో మళ్లీ వర్షం మొదలైంది. పలు జిల్లాల్లో దంచికొడుతోంది. తాజాగా సంగారెడ్డి, మెదక్ జిల్లాలో అల్లకల్లోలం సృష్టించింది వర్షం. దీంతో వాగులు పొంగిపొర్లుతున్నాయి. పలు చోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లో 14.7 సెం. మీ, మెదక్ జిల్లా శివంపేటలో 12.8 సెం.మీ మేర వర్షపాతం నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లా మీన్ పూర్‌లో కోమటి కుంటకు గండి పడటంతో పంటపొలాలు నీట మునిగాయి. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం కాజీపేట శివారు మోత్కుల కుంటకు గండి పడి నీరు వృథాగా పోతోంది. మెదక్ జిల్లా రెగోడ్‌లో వర్షానికి పెట్రోల్ బంక్ జలమయమయ్యింది. మెదక్ జిల్లా ధూప్ సింగ్ తండా, సంగారెడ్డి జిల్లా నాగల్ గిద్ద లోని మున్యాతండా, గైరాన్ తండాకు రాకపోకలు నిలిచిపోయాయి. మూడు రోజు మంజీరా నది ఉద్ధృతికి ఏడుపాయల ఆలయం మూతపడింది. అమ్మవారి ఆలయం ఎదుట మంజీరా నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. సింగూరు ప్రాజెక్టు 5 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు అధికారులు. కాగా.. రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఆగస్టు 18 వరకు ఈ వర్షాలు ఉంటాయని తెలిపింది. ఆగస్టు 16, 17న ఉత్తర, తూర్పు జిల్లాలో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆగస్టు 16న ఏడు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాద్ , ములుగు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. 8 జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశంతో ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, హనుమకొండ, వరంగల్, సూర్యాపేట, ఖమ్మం జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

# మహిళాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)
- మహిళా సంఘాలకు రూ. 26 వేల కోట్ల రుణాలు
- వికారాబాద్ జిల్లా, చేవెళ్ల నియోజకవర్గం నవాబు పేట్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



వికారాబాద్, ఆగస్టు 16(ప్రజా స్వరం):

మహిళాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శనివారం చించల్ పేట్ గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య తో కలిసి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు గావించారు.
వికారాబాద్ జిల్లా, చేవెళ్ల నియోజకవర్గం నవాబు పేట్ మండలంలోని చించల్ పేట్ గ్రామంలో 15 లక్షలతో అంగన్వాడి భవనం, 20 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్, 20 లక్షలతో పశు వైద్య ఉపకేంద్ర భవనం, 20 లక్షలతో డ్వాక్రా భవనం, 30లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్, 20 ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవనం, 20 లక్షలతో గ్రామపంచాయతీ భవనాలను అతిథులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో పంచాయత్ రా శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమం చేపడుతుందన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూనే ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని ఆమె అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, వడ్డీ లేని రుణాలు, క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రభుత్వం దోహదం చేస్తుందన్నారు. మహిళలందరిని సంఘాల్లో చేర్పించాలని, సంఘాల్లో ఉన్నవారికి రుణాలు పొందే అవకాశం ఉంటుందని, ఇప్పటికే మహిళా సంఘాలకు రూ. 26 వేల కోట్ల అప్పులు ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు. రూ. 800 కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరిగిందని ఆమె అన్నారు. మహిళా సంఘాల్లో ఉన్న మహిళలు రుణాలు పొంది మరణించినట్లయితే 2 లక్షల లోన్ బీమా చేయించడం జరుగుతుందని ఆమె తెలిపారు. మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు వస్తున్నాయని ఆమె అన్నారు. 15 సంవత్సరాల వారికి మహిళా సంఘాల్లో సభ్యత్వం కల్పించడం జరుగుతుందని అదేవిధంగా 60 సంవత్సరాలు దాటిన మహిళలకు కూడా సంఘాల్లో చోటు కల్పించడం జరుగుతుందని ఆమె అన్నారు. 200 యూనిట్ల వరకు విద్యుత్తును ఉచితంగా అందజేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ప్రతి పేదవాడు సన్న బియ్యంతో భోజనం చేయాలన్న సదుద్దేశంతో సన్న బియ్యాన్ని అందించడం జరుగుతుందని ఆమె తెలిపారు. అదేవిధంగా రైతులను సన్న వడ్లు పండించేందుకు ప్రోత్సహిస్తూ క్వింటాల్ కు అదనంగా 500 రూపాయల బోనస్ ను కూడా ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. ప్రజల ఆరోగ్య దృష్ట్యా ఆరోగ్యశ్రీ కింద వైద్యానికి 5 లక్షల నుండి 10 లక్షల వరకు పెంచడం జరిగిందని ఆమె అన్నారు. ఎస్సీ, ఎస్టీ , మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... చించలపేట గ్రామంలో పెద్ద మొత్తంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. శాఖ పరమైన ప్రజలకు సేవ చేసేందుకు నా వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు అందిపుచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట కట్టుబడి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందని ఆయన అన్నారు. గ్రామాల కనీస అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వ నిధులను కేటాయించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, ఆర్డిఓ వాసు చంద్ర, డిఆర్డిఎ శ్రీనివాస్, డిపిఓ జయసుధ, డిటిడబ్ల్యుఓ కమలాకర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి రాజరత్నం, పశుసంవర్ధక శాఖ అధికారి సదానందం, డిడబ్ల్యుఓ కృష్ణ వేణి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, ఇఇ ఉమేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి లు ఉన్నారు.

# నేరం అంగీకరించిన నమ్రత

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

సికింద్రాబాద్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో నిందితురాలు డాక్టర్ నమ్రత తన నేరాన్ని అంగీకరించారు. ఈ విషయాన్ని పోలీసులు వెల్లడించారు. నమ్రత కన్ఫెషన్ రిపోర్ట్‌లో సెన్సేషన్ విషయాలు నమోదు చేశారు. 1998లో మొదటిసారి విజయవాడలో ఫెర్టిలిటీ సెంటర్ స్థాపించానని, 2007లో సికింద్రాబాద్‌లో రెండో బ్రాంచ్ ఓపెన్ చేశానని తెలిపారు. ఆ తర్వాత విశాఖలోను మరో ఫర్టిలిటీ సెంటర్ ప్రారంభించానని, తనకు రెండవ కుమారుడు జయంతి కృష్ణ న్యాయవాదిగా ఉంటూ సహకరించేవాడని నేరాంగీకార పత్రంలో పేర్కొన్నారు. 'సరోగసి పేరుతో ఒక్కో జంట నుంచి 20 నుండి 30 లక్షలు వరకు వసూలు చేశాము. ఏజెంట్ల ద్వారా పిల్లలను కొనుగోలు చేశాము. అబార్షన్ కోసం ఆస్పత్రికి వచ్చే గర్భిణీలను గుర్తించి వారికి డబ్బులు ఆశ చూపాము. ప్రసవం తర్వాత వారి పిల్లల్ని కొనుగోలు చేసాము. ఎంతో మంది పిల్లలు లేని దంపతులకు సరోగసి ద్వారా పుట్టిన పిల్లలుగా నమ్మించాం. మొదట మహారాణిపేట పోలీస్ స్టేషన్లో నా మీద కేసు నమోదు అయింది. ఆ తరువాత వైజాగ్ టూ టౌన్, గోపాలపురం పోలీస్ స్టేషన్లలో ఐదు కేసులు.. గుంటూరు కొత్తపేటలో మరో కేసు నమోదయింది. 2020లో మహారాణిపేటలో నమోదైన కేసులో రిమాండ్ వెళ్లి వచ్చాను. పిల్లల్ని కొనుగోలు చేయడంలో సంజయ్ తో పాటు సంతోషి కీలకంగా వ్యవహరించారు. సికింద్రాబాద్ సెంటర్లో సూపర్వైజర్ కం ఫార్మసిస్ట్ గా కృష్ణ, రిసెప్షనిస్ట్ గా పద్మ, టెలికార్స్ గా అర్చన మేరీ, సోనా, నర్సుగా సురేఖ, ల్యాబ్ టెక్నీషియన్ గా ప్రభాకర్ ఉన్నారు' అని కన్ఫెక్షన్ రిపోర్టులో నమ్రత వెల్లడించారు. 'వైజాగ్ సెంటర్లో మేనేజర్ గా కళ్యాణి, ల్యాబ్ టెక్నీషియన్ గా రమ్య ఉన్నారు. విజయవాడలో డాక్టర్ మధులత, డాక్టర్ కిషోర్ బాబు, డాక్టర్ కరుణ కీలకంగా ఉన్నారు. అనస్తీషియా డాక్టర్ గా గాంధీ ఆస్పత్రికి చెందిన సదానందం కీలకంగా ఉన్నారు. డబ్బు మొత్తాన్ని వివిధ బ్యాంకులకు బదిలీ చేశాను. సరోగసి కేస్ షీట్లు మొత్తాన్ని ఎవరు ముట్టుకోకుండా భద్రంగా దాచాను. నా కన్సల్టెన్సీ రూమ్లో ప్రత్యేక బాక్సుల్లో భద్రపరిచాను. గోపాలపురంలో ఫిర్యాదు చేసిన రాజస్థాన్ దంపతుల కేసులో సరోగసి ద్వారా బిడ్డను ఇస్తానని నమ్మించాను. జూబ్లీహిల్స్ లోని ప్రముఖ ఆస్పత్రికి అబార్షన్ కోసం వచ్చిన దంపతులను మా ఏజెంట్లు డబ్బుకు ఒప్పించారు' అని కన్ఫెక్షన్ రిపోర్టులో నమ్రత తెలిపారు.

# పదవులు, పైసలూ మీకేనా?

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

'పదవులు మీకే.. పైసలూ మీకేనా' అంటూ సీఎం రేవంత్ రెడ్డిని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. మునుగోడు నియోజకవర్గంలో రోడ్డు కాంట్రాక్టర్లకు, సీసీ రోడ్డు కాంట్రాక్టర్లకు ఒక్క రూపాయి నిధులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తనకు మంత్రి పదవి ఇవ్వనందుకు.. తన నియోజకవర్గ అభివృద్ధికి అయినా డబ్బులు ఇవ్వండి అని సీఎంను రాజగోపాల్ రెడ్డి కోరారు. శుక్రవారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎల్లగిరిలో నిర్వహించిన సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి పాల్గొన్నారు. విగ్రహాన్ని ఆవిష్కరణ అనంతరం సొంత పార్టీపై మరోసారి విరుచుకుపడ్డారు. 'వలిగొండచౌటుప్పల్ రోడ్డు బిల్లు రావడం లేదని కాంట్రాక్టర్ పనులు ఆపేశాడు. బిల్లును సీఎం రేవంత్ రెడ్డి ఇస్తే వస్తుంది. అందుకే సీఎంనే నేరుగా అడుగుతున్నా. సీఎం, కాంగ్రెస్ పార్టీని నేను విమర్శించడం లేదు. నా నియోజకవర్గంకు రావాల్సిన నిధులు అడుగుతున్నా. 20 నెలల నుంచి నా నియోజకవర్గంలో రోడ్లకు, బిల్డింగులకు ఒక్క రూపాయి కూడా రాలేదు. నేనే స్వయంగా మంత్రి దగ్గరకు వెళ్లి అడిగినా బిల్లులు రాలేదు. వందసార్లు తిరిగినా రాలేదు. అందుకే పదవులలో మీరే ఉంటారు.. నిధులు మీరే తీసుకుంటున్నారు అని అడగాలా వద్దా?. కనీసం నాకు పదవి ఇవ్వనందుకు.. నా నియోజకవర్గ అభివృద్ధికి డబ్బులు అయినా ఇవ్వండి. నాకు అన్యాయం చేసినా పర్వాలేదు, నా మునుగోడు నియోజకవర్గంకు నిధులు ఇవ్వండి' అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కోరారు. 'మంత్రి పదవి విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుంది. పదవి వచ్చేటప్పుడు.. ఎవ్వరు ఆపినా ఆగదు. పదవి వస్తే మునుగోడు నియోజకవర్గ ప్రజలకే న్యాయం జరుగుతుంది. నాకు మునుగోడు ప్రజలే ముఖ్యం. మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోసం కొట్లాడాలి' అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు.

# నేటి నుంచి బీహార్‌లో రాహుల్ యాత్ర

- 'ఓటర్ అధికార్ యాత్ర' పేరుతో..
- 16 రోజులు.. 24 జిల్లాల్లో పర్యటన
- బీహార్‌లో మొదలైన ఎన్నికల సమరం
- ఎన్డీఏ, ఇండియా కూటమీ పార్టీల వ్యూహం
- అధికారం చేజిక్కించుకోడాన్ని ప్రణాళికలు

నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :

బీహార్ ఎన్నికల సమరం మొదలైంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార ఎన్డీఏ, ప్రతిపక్ష ఇండియా కూటమీ పార్టీలు రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకోడాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. బీహార్ ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేస్తున్నారు. తాజాగా ఆయన ఆగస్టు 17 నుంచి బీహార్‌లో యాత్ర చేపట్టనున్నట్లు హస్తం పార్టీ పేర్కొంది. ఈ యాత్రకు 'ఓటర్ అధికార్ యాత్ర' అని పేరు పెట్టినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

**రోహ్తాస్ జిల్లా నుంచి ప్రారంభం కానున్న యాత్ర..**

బీహార్ రాష్ట్రంలో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ ఈ 'ఓటర్ అధికార్ యాత్ర' చేపట్టనున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఆయన రాష్ట్రంలో 16 రోజుల పాటు ఉండనున్నారు. ఈ సమయంలో ఆయన 24 జిల్లాల్లో పర్యటిస్తారని కాంగ్రెస్ ఎంపీ అఖిలేష్ సింగ్ తెలిపారు. యాత్రకు సంబంధించిన అన్ని సన్నాహాలు పూర్తయ్యాయని ఎంపీ తెలిపారు. సెప్టెంబర్ 1న పాట్నాలో జరిగే ర్యాలీతో 'ఓటు అధికార్ యాత్ర' ముగుస్తుందన్నారు. యాత్రలో ఇండియా కూటమీలోని అన్ని పార్టీల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. రాహుల్ గాంధీ తన యాత్రను ససారాం నుంచి ప్రారంభిస్తారని అఖిలేష్ ప్రసాద్ సింగ్ అన్నారు. ఈ యాత్రకు సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. బీహార్ ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ కాకుండా, మూడు వామపక్ష పార్టీలు సహా ఇతర కూటమి పార్టీల సభ్యులు కూడా ససారాంలో రాహుల్ గాంధీతో చేరవచ్చని పేర్కొన్నారు. సెప్టెంబర్ 1 పాట్నాలోని గాంధీ మైదానంలో యాత్ర ముగిస్తుందని తెలిపారు.

**ఓట్ల దొంగతనానికి వ్యతిరేకంగా..**

రాహుల్ గాంధీ తన సోషల్ మీడియా ఖాతాలో ఒక పోస్ట్‌ను షేర్ చేశారు. ఆగస్టు 17 నుంచి జరిగే 'ఓటర్ అధికార్ యాత్ర'తో బీహార్ నుంచి ఓటు దొంగతనానికి వ్యతిరేకంగా తాము ప్రత్యక్ష పోరాటం చేస్తామని అన్నారు. ఇది కేవలం ఎన్నికల సమస్య కాదు, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని 'ఒక వ్యక్తి, ఒక ఓటు' అనే సూత్రాన్ని రక్షించడానికి చేయనున్న ఒక నిర్ణయాత్మక యుద్ధం అని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడటానికి బీహార్ యువత తమతో పాటు వస్తారని అన్నారు. యువతందరూ వచ్చి తమతో చేరి రాజ్యాంగాన్ని రక్షించాలని ఆయన పిలుపునిచ్చారు.

# అమెరికాకు కల్వకుంట్ల కవిత పయనం

- శంషాబాద్ ఎయిర్ పోర్టులో సెండాఫ్ ఇచ్చిన భర్త
- చిన్న కుమారుడు ఆర్యను కాలేజీలో చేర్పించేందుకు అమెరికాకు
- 15 రోజుల పాటు అమెరికా పర్యటనలోనే కవిత

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అమెరికాకు పయనం అయ్యారు. శనివారం ఉదయం పెద్ద కుమారుడు ఆదిత్య, చిన్న కుమారుడు ఆర్యతో కలిసి అమెరికాకు బయల్దేరారు. శంషాబాద్ ఎయిర్ పోర్టులో కవిత భర్త అనిల్, కుటుంబ సభ్యులు, తెలంగాణ జాగృతి నాయకులు సెండాఫ్ ఇచ్చారు. చిన్న కుమారుడు ఆర్యను కాలేజీలో చేర్పించేందుకు కవిత అమెరికా వెళుతున్నారు. 15 రోజుల పాటు అమెరికా పర్యటనలో ఉండనున్నారు. ఎమ్మెల్సీ కవిత సెప్టెంబర్ ఒకటో తేదీన హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. అమెరికా పర్యటన నేపథ్యంలో తండ్రి కేసీఆర్‌ను కలిసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్సీ కవిత ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌కు శుక్రవారం వెళ్లారు. చిన్న మనువడు ఆర్యను కేసీఆర్ ఆశీర్వదించారు. ఇక కవిత అమెరికా పర్యటనకు ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు ఇప్పటికే అనుమతించిన విషయం తెలిసిందే. అమెరికాకు వెళ్లేందుకు అనుమతి కావాలంటూ.. రౌస్ అవెన్యూ కోర్టును కవిత ఆశ్రయించారు. కోర్టు ఆమె పాస్‌పోర్టును రిలీజ్ చేసింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవితను 2024 మార్చి 15న ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఐదు నెలల జైలు శిక్ష అనంతరం షరతుల మీద బెయిల్ మంజూరైంది. ఆ సమయంలో కవిత తన పాస్‌పోర్టును రౌస్ అవెన్యూ కోర్టులో సమర్పించారు.





# సికింద్రాబాద్‌లో తపస్వి పీపుల్స్ లైబ్రరీ ప్రారంభోత్సవం

**హైదరాబాద్, ప్రజాస్వరం :**

సాహితీ ప్రపంచంలో తనకంటూ విశేషమైన స్థానాన్ని సంపాదించుకున్న తపస్వి మనోహరం సంస్థ, అంతర్జాల వేదికగా తెలుగులో తపస్వి మనోహరం వారపత్రిక, మనోహరి మహిళా మాసపత్రికలు మరియు హిందీ, ఇంగ్లీష్ లో కూడా మాసపత్రికలను వెలువరిస్తూనే తపస్వి డ్రీమ్ టేల్స్ అనే మరొక వినూత్న వేదికను ప్రారంభించి, స్టాండప్ స్టోరీ టెల్లర్స్ ని సమాజానికి పరిచయం చేస్తూ, కథలు చెప్పడంలో మెళకువలను నేర్పిస్తూ ముందుకు సాగుతున్నారు.కార్తిక్ నిమ్మగడ్డ తపస్వి సంస్థల సిఈవో పత్రికా ప్రపంచంలో తమ స్థానాన్ని పదిలపరచుకోవడమే కాకుండా పబ్లిషర్ గా ఎన్నో వందల పుస్తకాలను అతి తక్కువ ఖర్చులో అందంగా అచ్చువేసి వర్దమాన రచయితలకు కలలను సాకారం చేయడం కూడా తపస్వి సంస్థలు సాధించిన ఘనత.సికింద్రాబాదులో తపస్వి పీపుల్స్ లైబ్రరీ పేరుతో ఉచిత లైబ్రరీని ప్రముఖ కవయిత్రి, రచయిత్రి కణిక వ్యవస్థాపక అధ్యక్షురాలు మోటివేషనల్ స్పీకర్ రమాదేవి కులకర్ణి, ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో తపస్వి సంస్థల డైరెక్టర్స్ శ్రీ స్వప్న(బుజ్జమ్మ) శ్రీమలవతు విజయ,ఇతర టీమ్ మెంబెర్స్ పాల్గొన్నారు. సాధనా కుటీర్ అనబడే ఒక చక్కని ఆవరణలో అన్ని పుస్తకాలు అందుబాటులో ఉండేలా లైబ్రరీ ప్రారంభోత్సవం జరిగింది. కనెక్ట్ హబ్ ఫౌండర్ కిరణ్ రాథోడ్, సౌజన్యంతో వివిధ కార్యక్రమాలు సంగీతం, ఆర్ట్స్, ఇతర ఈవెంట్స్ కూడా జరుగుతాయని, అందరికీ అందుబాటులో ఉండేలా వివిధ కళలలో వర్క్ షాప్స్ నిర్వహిస్తామని అన్నారు.

# యూట్యూబ్ చూసి దొంగతనాలు

**ఎస్బీఐ బ్యాంకులో దొంగతనానికి యత్నించిన నిందితుల అరెస్ట్**

**ట్రాక్టర్, రెండు ఆటోలు, బైక్, మద్యం సీసాలు స్వాధీనం**

**వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్రీనివాస రావు**









**మెదక్, ఆగస్టు 16 (ప్రజా స్వరం) :**

ఈ నెల 7 న ఏటీఎం చోరీ కి ప్రయత్నించిన నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు వెల్లడించారు. శనివారం మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవలే మెదక్ పట్టణంలోని ఎస్బిఐ బ్యాంకు లో దొంగతనానికి ప్రయత్నం చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వెల్దుర్తి మండలం మనేపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్, లింగం, ప్రసాద్ ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి కౌడిపల్లి వైన్స్ లో దొంగలించిన మద్యం సీసాలు, దొంగతనం చేసేందుకు ఉపయోగించిన సుత్తె, గడ్డపార, శానాం, తాడు, సంచులు బైకులను, గుమ్మడిదల వద్ద ఏటీఎం దొంగతనానికి ఉపయోగించిన ట్రాక్టర్ ను, మరో రెండు ఆటో లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ నిందితులు ఎలాంటి పనులు చేసుకుండా మద్యానికి, చెడు అలవాట్లకు బానిసై తొందరగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో యూట్యూబ్ వీడియోలు చేసి దొంగతనానికి చేస్తున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో సహకారం చేసిన మెదక్ టౌన్ డి మహేష్, అతని బృందం ఎస్ఐ అమర్, కానిస్టేబుల్ లు నర్సింలు, నికిల్, మల్లేశం లను కౌడిపల్లి ఎస్ఐ రంజిత్ రెడ్డి, కానిస్టేబుల్ బాగయ్యా ను అభినందించారు.

## బీజేపీ జిల్లా నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేత



**మెదక్ ఆగస్టు 16 (ప్రజా స్వరం) :**

బీజేపీ మెదక్ జిల్లా నూతన జిల్లా కమిటీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు శనివారం మెదక్ జిల్లా బీజేపీ జిల్లా కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ నూతన జిల్లా కమిటీ ప్రకటించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారికి నియామక పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. పార్టీ మీపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యత మీకు ఇవ్వడం జరిగిందని, పార్టీ అభివృద్ధి కోసం క్రమశిక్షణతో పార్టీని ముందుకు తీసుకు వెళ్లాలని అన్నారు. నూతన జిల్లా కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిలు శ్రీనివాస్, రంజిత్ రెడ్డి, సంఘసాని సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు బుచేష్‌యాదవ్, తీగల శ్రీనివాస్, కే. నాగరాజు, కాజీపేట రాజేందర్, శంకర్ గౌడ్, నారాయణ రెడ్డి, జిల్లా కార్యదర్శులు వి. మహేశ్వరి, కల్కి నాగరాజు, బిక్షపతి, బాదె బాలరాజు, అశోక్ సాదుల, సత్యనారాయణ, జిల్లా కోశాధికారి ఆంజనేయులు, కార్యాలయ కార్యదర్శి సాయికిరణ్ నియామకం అవ్వడం జరిగిందని అన్నారు.

# ఘనంగా చెన్నకేశవ స్వామి జాతర



**పరిగి, ఆగస్టు 16 (ప్రజా స్వరం) :**

గండీడ్ మండలం గోవిందుపల్లి గ్రామం శ్రీశ్రీశ్రీ వరాహగిరి గట్టు చెన్న కేశవ స్వామి జాతర మహోత్సవం శని వారం ఘనంగా జరిగింది.ఈ జాతర ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు . ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.వెన్న ఈశ్వరప్ప స్థానిక బిజెపి నాయకులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా పరిగి అసెంబ్లీ కన్వీనర్ తుప్ప విజయ్ కుమార్ ,మండల ఉపాధ్యక్షులు జి మల్కయ్య , బద్రిశ్వర్ , మండల గిరిజన మోర్చా అధ్యక్షులు సంతోష్ నాయక్, మాజీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ , మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు వెంకటేష్ , గోవిందపల్లి మాజీ ఉపసర్పంచ్ బోయ కుర్మయ్య,శక్తి కేంద్రం ఇన్చార్జ్ కె నరేందర్,వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు నరేందర్, శ్రీను, వంశీ, బిజెపి నాయకులు పాండు, సంగమేశ్వర్, మహేష్, ప్రవీణ్ మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ**




**పరిగి, ఆగస్టు 16 (ప్రజా స్వరం) :**

వికారాబాద్ జిల్లా పరిగి పట్టణ కేంద్రంలో శని వారం వికలాంగుల హక్కుల పోరాట సమితి సన్నాహక సమావేశంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ సెప్టెంబర్ 3వ తేదీన జరిగే మహాగర్జనను విజయవంతం చేయాలని అదే విధంగా ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలను వికలాంగులు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తడి తెచ్చి వికలాంగుల హక్కులను సాధించుకుందామని సెప్టెంబర్ 3వ తేదీన జరిగే మహాగర్జనను విజయవంతం చేయాల్సిందిగా వికలాంగుల సన్నాహక సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ వికలాంగుల సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, చేయూత పింఛన్ దారులు, ఒంటరి మహిళా దారులు, వితంతువులు, వృద్ధప్య పింఛన్ దారులు తదితరులు పాల్గొన్నారు.

## పద్మావతి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పుష్ప అర్చన



**రామాయంపేట, (ప్రజా సర్వం) :**

మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో శ్రావణమాసం ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రావణమాసం నాలుగవ శనివారం పురస్కరించుకొని శ్రీ పద్మావతి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పుష్ప అర్చన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం శ్రీ పద్మావతి గోదా సమేత వెంకటేశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, అష్టోత్తర నామాలతో పూజా కార్యక్రమం నిర్వహించారు. రంగురంగుల పూలమాలలు పట్టు వస్త్రాలతో స్వామివారిని అందంగా అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. నాలుగవ శనివారం పురస్కరించుకొని స్వామివారికి పుష్పార్చన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శ్రావణమాసం సందర్భంగా ఏర్పాటు చేసిన పుష్పార్చన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు వివిధ రకాల పూలతో స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం లేదు

**వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మెతుకు ఆనంద్**



**వికారాబాద్, ఆగస్టు 16(ప్రజా స్వరం) :**

చేవెళ్ల నియోజకవర్గం, నవాబుపేట మండలం, *చించల్ పేట్ గ్రామంలో పర్యటించిన మంత్రి సీతక్కకు నవాబుపేట్ మండలంలోని ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా వినతి పత్రం అందజేయడానికి వెళ్లిన బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చెయ్యటన్ని ఖండిస్తున్నాను అని వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మెతుకు ఆనంద్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో స్వాతంత్రం, ప్రజాస్వామ్య విలువలు లేకుండా పోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును చూసి ప్రజాస్వామ్యవాదులు మరియు ప్రజలు సిగ్గుతో తలదించుకుంటున్నారు అని అన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగం అమలులో లేదు, అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతూ.. పార్టీ నాయకులను ఇబ్బంది పెడుతున్నారు. ఎక్కడ చూసిన పోలీసుల దౌర్జన్యం పెరిగిపోయింది. ప్రజా సమస్యల పరిష్కారం మరియు ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడటానికి రాష్ట్రంలో కేసిఆర్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.

## త్రిష వివాహ ఖర్చులకు 20000 వేల ఆర్థిక సహాయం

**మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తుంకి రమేష్**



**శామీర్ పేట ఆగస్టు 16(ప్రజాస్వరం) :**

అలియాబాద్ మున్సిపల్ పరిధి లోని మజీద్ పూర్ గ్రామానికి చెందిన తుంకి కుమార్ లావణ్య దంపతుల కుమార్తె త్రిష వివాహ ఖర్చులకు శామీర్ పెట మండల కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తుంకి రమేష్ 20000 వేల ఆర్థిక సహాయం అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఏఎంసి డైరెక్టర్ తుంకి భిక్షపతి, నాయకులు తుంకి. స్వామి, కుడుముల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక

- **ప్రతి క్రీడాకారుడు సద్వినియోగం చేసుకోవాలి**
- **జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ లోంక నర్సింలు**



**తాండూరు, ఆగస్టు 16(ప్రజా స్వరం) :**

జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ క్రీడల ఎంపికను ప్రతి క్రీడాకారుడు సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ లోంక నర్సింలు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 17న, ఆదివారం ఉదయం 8 గంటలకు తాండూర్ పట్టణంలోని విలియమున్ మైదానంలో జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్ 14.16.18.20 విభాగంలో 600 మీటర్, 100 మీటర్, 200 మీటర్, 300 మీటర్ పరుగు పందెం, హై జంప్, లాంగ్ జంప్, షాట్ పుట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులు, మరియు సర్టిఫికెట్లతో పాటు ఈనెల 30.31 తేదీల్లో మహబూబ్ నగర్ లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ సూచించారు ఆసక్తి గల క్రీడాకారులు పిఈటి రాము 6300075229.9951343432 నంబర్ల కు ఫోన్ చేసి సంపాదించాలని కోరారు.

## జాతీయ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా కౌశిక్ రెడ్డి

**గుమ్మడిదల ,ఆగస్టు 16 (ప్రజాస్వరం) :**



జాతీయ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా బొంతపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఉప్పనూతుల కౌశిక్ గౌడ్ ను జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నియమాక పత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను బీసీ వెల్ఫేర్ జాతీయ జాయింట్ సెక్రటరీగా ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. బీసీ వర్గాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు.



# టి బి నివారణకు ప్రతి ఒక్కరు బాద్యత తీసుకోవాలి

మొదటిపేజీ తరువాయి

మరియు చెస్ట్ డిసిసెస్ కాన్ఫరెన్స్2025 ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణు దేవ వర్మ పాల్గొని మాట్లాడుతూ టి బి వ్యాధి నివారణ కోసము ప్రతి ఒక్కరు బాద్యత తీసుకోవాలి,టిబి రాకుండా జాగ్రత్త పడాలి, టి బి వ్యాధి నివారణ కోసము చాల రకాల మందులు వచ్చాయన్నారు. వికారాబాద్ కి హవా మరీ జోం కి దవా , రాజకీయ నాయకులు, కవులు, పద్మ శ్రీ అవార్డు పొందిన వారు, రచయిత లు అందరిని టి బి నిర్మూలనలో బాగస్వామ్యం చేయాలన్నారు.

సబ్ కా వికాస్ సబ్ కా ప్రయాస్,టి బి నిర్మూలనలో అందరు కష్ట పడితేనే అందరు ఆరోగ్యంగా ఉంటారు.రాష్ట్రానికి, దేశానికి అన్ని జిల్లా ల కంటే వికారాబాద్ జిల్లా ను రోల్ మాడల్ గా తీర్చి దిద్దాలని , ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని తెలంగాణా టి బి చెస్ట్ డిసీసేస్ కాన్ఫరెన్స్ సందర్భంగా ఆదేశించారు. అందరికి టి బి లక్షణాల గురించి అవగాహనా కలిపించడం ద్వార త్వరగా టిబి ని నిర్మూలించవచ్చాన్నారు. టి బి ముక్త్ భరత్ కోసం ప్రతి ఒక్కరు బాద్యత గా వ్యవహరించాలన్నారు. వికారాబాద్ జిల్లా కు స్పీకర్, ఏం పి ఉండటం జిల్లా అదృష్టమన్నారు.టిబి నిర్మూలనలో జిల్లాను ఆదర్శంగా నిలపాలని తెలిపారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన టి బి జిల్లా అధికారులైన డాక్టర్ మల్లికార్జున ( మహబూబ్ నగర్) డాక్టర్ రాజు (జోగులాంబ గద్వాల్) , డాక్టర్ సుమలత (ఆదిలాబాద్) డాక్టర్ పుల్ల రెడ్డి లకు ప్రశంశా పత్రాలు, గోల్డ్ మెడల్ ,మేమొంటో లు అందజేశారు.

మూడవ తెలంగాణ ట్యూబర్ క్యూలోసిస్ మరియు చెస్ట్ డిసిసెస్ కాన్ఫరెన్స్2025 ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ , చేవెళ్ళ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిషోర్ ఐ ఎ ఎస్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్ పి నారాయణ రెడ్డి, టి బి అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ సుదీర్ ప్రసాద్,దీన దయాళ్ బాగ్ ,డాక్టర్ నరేందర్, బాల చందర్ ,డాక్టర్ లు తదితరులు పాల్గొన్నారు .




# ఇక పాన్ 2.0

ముంబై, ఆగస్టు 16, (ప్రజాస్వరం)

పాన్.. ఇన్‌కం ట్యాక్స్ చెల్లింపులో ఒక అద్భుతం. పన్ను ఎగవేతదారులను పట్టించే ఆయుధం. అయితే ఇప్పటికీ చాలా మంది ఈ పాన్‌ను కూడా దుర్వినియోగం చేస్తున్నారు. పన్ను ఎగవేతకు అడ్డదారులు వెతుకుతున్నారు. పాన్‌లోని లోపాలు వారికి కలిసి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం 2026లో పాన్ 2.0ను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఇది పన్ను సంబంధిత సేవలను ఒకే డిజిటల్ వేదికపై ఏకీకృతం చేయడం ద్వారా పౌరులకు సౌలభ్యాన్ని అందించనుంది. క్యాబినెట్ కమిటీ ఆన్ ఎకనామిక్ అఫైర్స్ (సీసీఈఏ)ఆమోదంతో రూ.1,435 కోట్ల బడ్జెట్‌తో, ఐటీ దిగ్గజం ఎల్‌టీఐమైండ్‌ట్రీ ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసి నిర్వహించనుంది.ప్రస్తుతం, పాన్ (పర్మనెంట్ అకౌంట్ నంబర్), టీఏఎన్ (టాక్స్ డిడక్షన్ అండ్ కలెక్షన్ అకౌంట్ నంబర్) సేవలు ఇన్‌కమ్ టాక్స్ ఈ-ఫైలింగ్ పోర్టల్, యూటీఐఐటీఎస్ఎల్, ప్రొటీన్ (గతంలో ఎన్ఎస్‌డీఎల్) వంటి బహుళ వేదికలపై విస్తరించి ఉన్నాయి. పాన్ 2.0తో, ఈ సేవలన్నీ ఒకే కేంద్రీకృత డిజిటల్ ఇంటర్‌ఫేస్‌లో అందుబాటులోకి వస్తాయి. ఇది పౌరులకు సమయం ఆదా చేయడమే కాక, కాగితం లేని ప్రక్రియలను ప్రోత్సహిస్తుంది. పాన్ 2.0 వివిధ సంస్కరణలను తీసుకొస్తుంది, ఇవి ఖాతాదారుల అనుభవాన్ని మెరుగుపరుస్తాయి:ప్రస్తుతం పాన్ దరఖాస్తు, సవరణలు, ఆధార్ లింకింగ్, ధ్రువీకరణల కోసం బహుళ వెబ్‌సైట్‌లను ఉపయోగించాల్సి ఉంటుంది, ఇది సంక్లిష్టంగా ఉంటుంది.పాన్ 2.0లో అన్ని సేవలు ఒకే వేదికపై అందుబాటులో ఉంటాయి, ఇది వినియోగదారులకు సౌలభ్యాన్ని, సమయం ఆదాను అందిస్తుంది. ఇప్పటికే పాన్ కార్డు ఉన్నవారు కొత్త దరఖాస్తు చేయనవసరం లేదు. ప్రస్తుత పాన్ నంబర్ పాన్ 2.0 కింద పూర్తిగా చెల్లుబాటవుతుంది. ఇది ఖాతాదారులకు ఆర్థిక, సాంకేతిక భారాన్ని తగ్గిస్తుంది. పాన్ వివరాల సవరణలు ఉచితంగా ఉంటాయి. సవరించిన ఈ-పాన్ నేరుగా రిజిస్టర్డ్ ఈమెయిల్‌కు పంపబడుతుంది. ఇది వేగవంతమైన, ఖర్చు లేని సేవలను అందిస్తూ, డిజిటల్ పరివర్తనను ప్రోత్సహిస్తుంది.పాన్ కార్డులపై ఉన్న క్యూఆర్ కోడ్ కేంద్రీకృత డేటాబేస్ నుంచి తాజా సమాచారాన్ని ప్రదర్శిస్తుంది. గుర్తింపు ధ్రువీకరణ వేగవంతంగా, సురక్షితంగా జరుగుతుంది, మోసాలను తగ్గిస్తుంది. డిజిటల్ ఇండియా మిషన్‌లో భాగంగా, పాన్ బహుళ ప్రభుత్వ సేవలకు యూనివర్సల్ డిజిటల్ ఐడెంటిటీగా మారవచ్చు. ఇది పౌరులకు ఒకే గుర్తింపుతో బహుళ సేవలను యాక్సెస్ చేసే సౌలభ్యాన్ని అందిస్తుంది.ఇప్పటి పాన్ కార్డులు ఎటువంటి మార్పు లేకుండా చెల్లుబాటవుతాయి. క్యూఆర్ కోడ్ లేని కార్డుల ఉన్నవారు, ప్రస్తుత లేదా కొత్త వ్యవస్థలో రీప్రింట్ కోసం దరఖాస్తు చేయవచ్చు. పాన్ 2.0 అమలులోకి వచ్చిన తర్వాత, సవరణలు, ధ్రువీకరణలు వేగవంతంగా, పూర్తిగా డిజిటలైజేషన్ సేవలు అందుబాటులోకి వస్తాయి.పాన్ 2.0 భారతదేశంలో పన్ను సంబంధిత సేవలను సరళీకరించడంతోపాటు, డిజిటల్ గుర్తింపు వ్యవస్థ వైపు ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుంది. ఇప్పటి పాన్ కార్డు హోల్డర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, ఉచిత సవరణలు, వేగవంతమైన ఈ-పాన్ సేవలు, మెరుగైన ధ్రువీకరణ వంటి ప్రయోజనాలు అందిస్తుంది.

# ఉపరాష్ట్రపతి ఎన్నికపై ఎన్డీయే భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 16, (ప్రజాస్వరం)



పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో చోటుచేసుకున్న అనూహ్య పరిణామంతో దేశంలో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం మారిపోయింది. ఉపరాష్ట్రపతి పదవికి జగ్‌దీప్ ధన్కడ్ రాజీనామా దేశంలో సరికొత్త చర్చకు దారితీసింది. ఈలోగా ఉపరాష్ట్రపతి ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం తేదీలు ఖరారు చేయడంతో భారత చరిత్రలో ఇది రెండవ మధ్యంతర ఉపరాష్ట్రపతి ఎన్నికగా నిలుస్తుంది. ఇప్పుడు కాబోయే ఉపరాష్ట్రపతి ఎవరు అన్న అంశంపైనే విస్తృత చర్చ జరుగుతోంది. ప్రస్తుత సంఖ్యాబలం ప్రకారం అధికార నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ కూటమికి చెందిన అభ్యర్థే గెలుపొందే అవకాశాలు ఉన్నందున.. ఆ కూటమిలో జరుగుతున్న కసరత్తు ఆసక్తికరంగా మారింది. తాజాగా జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఇదే అంశంపై చర్చించి.. నిర్ణయాధికారాన్ని కూటమి పెద్దన్న భారతీయ జనతా పార్టీ అగ్రనాయకత్వానికే అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాకు ఈ నిర్ణయాధికారాన్ని కట్టబెడుతూ తీర్మానం కూడా చేశారు. అంటే పార్లమెంట్ ఉభయసభల్లో సభా నాయకులుగా ఉన్న ఈ ఇద్దరు ప్రభుత్వ శాసన వ్యూహాల్లో కీలక పాత్ర పోషిస్తున్నందున భారత ఉపరాష్ట్రపతి పదవికి ఎన్డీఏ అభ్యర్థిని ఎన్నుకునే అధికారాన్ని కట్టబెట్టారు. అయితే బీజేపీలోని అత్యుతన్న నిర్ణయాత్మక విభాగం (బీజేపీ పార్లమెంటరీ బోర్డు) ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేయడం కోసం ఈ నెల 17న సాయంత్రం గం. 6.00కు సమావేశం కానుంది. ఈ నేపథ్యంలో ఉపరాష్ట్రపతి రేసులో ఎవరున్నారన్న చర్చ ఊపందుకుంది.ఉపరాష్ట్రపతి ఎన్నిక పార్లమెంట్ ఉభయ సభల ఎంపీలు కలిసి ఓటు వేసే అరుదైన సందర్భాలలో ఒకటిగా నిలుస్తుంది. సెప్టెంబర్ 9న జరగనున్న ఈ ఎన్నిక జరగనుంది. ఇటువంటి ఎన్నిక్లో పార్టీల సంఖ్యాబలాలు ముఖ్యమైనవి. కానీ ప్రస్తుత పరిస్థితిలో ఎన్డీఏకు అత్యంత సౌకర్యవంతమైన ఆధిక్యం ఉంది. ఈ పరిస్థితుల్లో అధికార కూటమికి గెలుపు వ్యూహాలను పదనుపెట్టి సంఖ్యాబలాన్ని కూడగట్టాల్సిన అవసరం లేదు. కానీ ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ఎంపిక చేసే విషయంలో ఒక రాజకీయ సందేశాన్ని పంపాల్సి ఉంటుంది. ప్రాంతం, కులం, భావజాల మూలాలు, కూటమి లెక్కలను సమన్వయం చేయడంతో పాటు ఇంకా అనేక సమీకరణాలను బేరీజు వేసుకోవాల్సి ఉంటుంది.పార్లమెంటులో ఎన్డీఏ సంఖ్యాబలాన్ని ఒకసారి పరిశీలిస్తే.. రాజ్యసభలో బీజేపీకి 102 సీట్లు ఉండగా మిత్రపక్షాలైన జేడీ(యూ), ఏఐఏడీఎంకే, తెలుగుదేశం, ఎన్పీఎఫ్ మరియు ఇతర మిత్రపక్షాలతో కలిసి మొత్తం 239 సీట్లలో ఎన్డీయే బలాన్ని 132 సీట్లకు చేరింది. రాజ్యసభలో ఏడుగురు నామినేటెడ్ సభ్యులు కూడా ఓటు వేయడానికి అర్హులు. సాధారణ పరిస్థితుల్లో నామినేటెడ్ ఎంపీలు అధికారక కూటమికే మొగ్గు చూపుతుంటారు. ఈ సంఖ్యను కూడా కలుపుకుంటే అధికార కూటమి సంఖ్య 139కు చేరుతుంది. మిగతా సభ్యుల్లో అటు అధికార, ఇటు ప్రతిపక్ష కూటముల్లో లేని తటస్థ రాజకీయ పార్టీలకు చెందిన పార్టీల నేతలు కూడా ఉన్నారు. వారిలో కొందరు అధికార కూటమికి మద్దతు పలికే అవకాశాలు సైతం లేకపోలేదు.ఇక లోక్‌సభలో బీజేపీకి 240 మంది సభ్యులు, మిత్రపక్షాల 53 సీట్లతో కలిపి మొత్తం 542 మందిలో ఎన్డీయే బలం 293కు చేరుతుంది. రెండు సభలు కలిసి ఓటు వేసినప్పుడు, విజయానికి అవసరమైన సింపుల్ మెజారిటీని ఎన్డీయే సులభంగా అధిగమిస్తుంది.

కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండి కూటమిలో కాంగ్రెస్ నుంచి 99 లోక్‌సభ ఎంపీలు, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల మద్దతు కలిపినా సరే ఎన్డీఏ ఆధిపత్యాన్ని దెబ్బకొట్టడం కష్టం.భారత ఉపరాష్ట్రపతి, పార్లమెంటులోని రాజ్యసభకు ఎక్స్అఫీషియో చైర్మన్ కావడం వల్ల ఈ పదవికి అభ్యర్థిని ఎంపిక చేయడం అధికార కూటమికి వ్యూహాత్మకంగా మారుతుంది. ఎందుకంటే రాజ్యసభలో ప్రతిపక్షాలను అదుపుచేస్తూ సభా కార్యకలాపాలను సజావుగా నిర్వహించడంలో ఆ పదవిలో కూర్చునే వ్యక్తి శక్తి, సామర్థ్యాలు కీలకంగా మారతాయి. అన్నీ ఆలోచించి నాడు ఉపరాష్ట్రతిగా జగ్‌దీప్ ధన్కడ్‌ను ఎంపిక చేసినప్పటికీ.. ఆయన తన అధికార పరిధిని అతిక్రమించి ప్రభావం చూపాలని ప్రయత్నించారనే ఊహాగానాలు చర్చలోకి వచ్చాయి. అప్పట్లో ఉత్తరాదిన హర్యానా, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో గణనీయమైన ప్రభావాన్ని చూపగలిగే శక్తి, సంఖ్యాబలం కలిగిన జాట్ సామాజికవర్గాన్ని మచ్చిక చేసుకుని దగ్గర చేసుకునే ప్రయత్నాల్లో భాగంగా ఆ సామాజికవర్గంలో పలుకుబడి కల్గిన విద్యావంతుడు జగ్‌దీప్ ధన్కడ్‌ను ఎంపిక చేసినట్టు కథనాలు వచ్చాయి. గతాన్ని పక్కనపెట్టి.. వర్తమానంలోకి వస్తే.. కొత్త ఉపరాష్ట్రపతి అభ్యర్థి విషయంలో మోదీ, నడ్డాలు ఎన్నికల లెక్కలు, అంచనాలు, ఊహాగానాలకు అతీతంగా ఆలోచించే అవకాశం ఉంది. కీలకమైన పదవుల విషయంలో బీజేపీ అగ్రనాయకత్వం అందరి ఊహలను తలకిందులు చేస్తూ.. ఎవరూ ఊహించని వ్యక్తులను చివరిక్షణాల్లో తెరపైకి తెచ్చిన ఉదాహరణలు కోకొల్లలు. ఈసారి ఉపరాష్ట్రపతి అభ్యర్థి విషయంలో ఎలాంటి సమీకరణాలకు ప్రాధాన్యత ఇస్తారన్నదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గతంలో కాంగ్రెస్ సొంతంగా అధికారంలో ఉన్నప్పుడైనా, యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ పేరుతో కూటమిగా అధికారంలో ఉన్నప్పుడైనా, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలైనా.. గవర్నర్లుగా పనిచేసినవారినో, కేబినెట్ మంత్రులుగా ఉన్న వారినో ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అంతేకాకుండా వివిధ నేపథ్యాల నుంచి వచ్చినవారు సైతం ఈ పదవిని నిర్వహించారు. మోదీ సారథ్యంలోని ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి తన కేబినెట్‌లో మంత్రిగా ఉన్న సీనియర్ నేత ఎం. వెంకయ్య నాయుడును ఉపరాష్ట్రపతి పదవిలో కూర్చోబెట్టారు. ఆయన పదవీకాలం ముగిసిన తర్వాత జరిగిన ఎన్నికల్లో గవర్నర్‌గా పనిచేసిన జగ్‌దీప్ ధన్కడ్‌కు అవకాశం కల్పించారు. కానీ ఈసారి కచ్చితంగా ఈ తరహా నేపథ్యాలు కల్గినవారికే ఉపరాష్ట్రపతి పదవి ఇస్తారని ఊహించే పరిస్థితి లేదు.దశాబ్దకాలంగా బీజేపీ అనుసరించిన విధానాలు, వ్యూహాలను గమనిస్తే.. కీలక పదవులకు ఎంపిక చేసే అభ్యర్థుల ద్వారా రాజకీయంగా బీజేపీ పాదముద్రలను విస్తరించడానికి ఉపయోగించుకుంది. 2017లో ఉత్తరప్రదేశ్ నుంచి దళిత నాయకుడు రామ్ నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిగా ఎన్నుకున్నప్పుడు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఎం. వెంకయ్య నాయుడును ఉపరాష్ట్రపతిగా ఎన్నుకుని, ఉత్తర - దక్షిణ భారతదేశ సమతుల్యత పాటించింది.2022లో ఒడిశా గిరిజన నాయకురాలు ద్రౌపది ముర్మును రాష్ట్రపతిగా ఎన్నుకోవడంతో, రాజస్థాన్ జాట్ నాయకుడు జగదీప్ ధన్కర్‌ను ఉపరాష్ట్రపతిగా ఎన్నుకున్నారు. విభిన్న భౌగోళిక ప్రాంతాలు, కులాలు, సముదాయాలను కవర్ చేసే ఈ రొటేషన్ లాజిక్ ఒక అలిఖిత నియమంగా మారింది. అయితే, ఈసారి పరిస్థితి మరింత సంక్లిష్టంగా ఉంది. ఎందుకంటే బీజేపీ కొత్త జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి, తన సంస్థాగత నిర్మాణాన్ని సమీక్షించడానికి సిద్ధమవుతున్న వేళ అకస్మాత్తుగా ఉపరాష్ట్రపతి ఎన్నిక తెరపైకి వచ్చింది. దీంతో ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక ద్వారా ఏర్పడే ఖాళీ, బీజేపీ జాతీయాధ్యక్షుడి ఎంపిక కసరత్తు.. ఇవన్నీ కేంద్ర మంత్రివర్గంలోనూ భారీ మార్పులు, చేర్పులకు ఆస్కారం కల్పించనుంది. ఉదాహరణకు 2017 మాదిరిగా కేబినెట్ మంత్రిని తీసుకొచ్చి ఉపరాష్ట్రపతి పీఠంపై కూర్చోబెడితే.. ఆ స్థానాన్ని భర్తీ చేయడం ద్వారా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అనివార్యంగా మారుతుంది.ఈసారి ఉపరాష్ట్రపతి పదవికి కచ్చితంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నేపథ్యం కలిగినవారికే అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ నేపథ్యం లేనివారికి పదవులు ఇచ్చినప్పుడు వారు పార్టీపై కృతజ్ఞత, విధేయతను ప్రదర్శించకుండా విమర్శకులుగా మారి పార్టీని ఇరకాటంలో పడేసిన సందర్భాలు ఉన్నాయి. ఉదాహరణకు సత్యపాల్ మాలిక్‌ను గవర్నర్‌గా చేస్తే.. ఆయన కేంద్ర ప్రభుత్వంపైనే తీవ్రమైన విమర్శలు, నిరాధార ఆరోపణలు చేసి ఇబ్బందులు సృష్టించారు. ఆ తర్వాత జగ్‌దీప్ ధన్కడ్ సైతం ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసేలా వ్యవహరించారు. అందుకే ఈ రాజ్యాంగ పదవులను ఆర్ఎస్ఎస్ నేపథ్యం కలిగి, విధేయతను ప్రదర్శించే వ్యక్తులకే అవకాశం ఇవ్వాలన్న ఆలోచనకు బలం చేకూర్చుతోంది.ఈ సమీకరణాల ప్రకారం బిహార్ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌కు అవకాశాలను సన్నగిల్లాయి. మితవాద ముస్లిం వర్గాలను ఆకట్టుకోడానికి ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ఎంపిక ఒక వ్యూహాత్మక మార్గమని కొందరు సూచిస్తున్నప్పటికీ.. RSS నేపథ్యం లేకపోవడం ఆయకు మైనస్ పాయింట్‌గా మారింది. మ ఎవరిని తెరపైకి తెస్తారు అన్న చర్చ తీవ్ర ఉత్కంఠకు దారితీస్తోంది.ప్రతిపక్షం ఖచ్చితంగా ఒక అభ్యర్థిని నిలబెట్టి, ఎన్డీఏ రాజకీయాలను లక్ష్యంగా చేసుకుని ఒక కథనాన్ని నిర్మించే ప్రయత్నం చేస్తుంది. ఎన్డీఏ తమ అభ్యర్థిని ప్రకటించిన తర్వాత ఇండి కూటమి కూడా తమ అభ్యర్థిని ప్రకటించాలని చూస్తోంది. కానీ ఎన్డీఏ సంఖ్యాబలం కారణంగా, ఈ పోటీ కేవలం పేరుకే తప్ప ప్రతిపక్ష అభ్యర్థి గెలుపు సాధ్యం కాదని ఆ కూటమి నేతలందరికీ తెలుసు. అయితే అధికార కూటమికి వ్యతిరేకంగా విమర్శలు గుప్పించడానికి, తమ ఓటుబ్యాంకును కాపాడుకోడానికి ఈ ఎన్నికలను ప్రతిపక్ష కూటమి ఒక సాధనంగా మార్చుకోవాలని చూస్తోంది.



# మండల కేంద్రంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- **త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు.**

తుగ్గలి: ప్రజాస్వరం

మండల కేంద్రమైన తుగ్గలిలోని రామాలయం వీధి నందు శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు శ్రీ కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతోప్రారంభించారు.కృష్ణాష్టమి వేడుకలలో భాగంగా మొదటి రోజైన శనివారం రోజున ఉదయాన్నే పూజా మండపంలో శ్రీకృష్ణుని ప్రతిమలకు పూలతో చక్కగా అలంకరించి భక్తిశ్రద్ధలతో ప్రజలు పూజలను నిర్వహించారు.అనంతరం భగవద్గీతను పఠనం చేస్తూ విలువైన సందేశాలను వారు భక్తులకు వివరించారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు .ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ ఆదివారం రోజున మధ్యాహ్నం రెండు గంటల నుండి శ్రీకృష్ణుని ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు.గ్రామ పురవీధుల్లో భక్తుల దర్శనార్థం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ శ్రీకృష్ణుని ప్రతిమను ఊరేగింపును నిర్వహిస్తున్నట్లు ప్రబోధ సేవా సమితి సభ్యులు తెలియజేశారు.ఈ ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించి శ్రీకృష్ణుని ఆశీస్సులు పొందాలని ప్రబోధా సేవా సమితి సభ్యులు తెలియజేశారు. మండల పరిధిలోని జొన్నగిరి తదితర గ్రామాలలో ప్రబోధ సేవా సమితి సభ్యులు ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

జయశంకర్ భూపాలపల్లి, ప్రజాస్వరం

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శనివారం మొరంచపల్లి వాగు ఉధృతిని ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాగు ఉధృతి దృష్ట్యా ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినపుడు తక్షణమే స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. ఎగువ భాగం నుండి ఎంత వరద వచ్చే అవకాశం ఉందన్న వివరాలు ఈ ఈ ప్రసాదు ను అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తగా ఉండాలని వరద పరిస్థితిని ముందుగా అంచనా వేసి ప్రజలను ముందస్తు అప్రమత్తం చేయాలని సూచించారు. వాతావరణ శాఖ సూచన మేరకు జిల్లాకు ఆదివారం వరకు రెడ్ అలెర్ట్ జారీ చేసిన నేపథ్యంలో యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబ్బంది కార్యస్థానాల్లో అందుబాటులో ఉండి రక్షణ చర్యలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. భారీ వర్షాలు దృష్ట్యా ప్రజల, పశువుల ప్రాణరక్షణలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముంపు ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సేవలకు ప్రజలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసే విధంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ కు కాల్ చేయాలని సూచించారు. 90306 32608 ద్వారా వచ్చిన ఫిర్యాదులకు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పశువులను మేతకు బయటికి పంపకుండా ఇంటి పట్టునే ఎత్తైన ప్రదేశంలో ఉంచాలని తెలిపారు. రహదారులపై నీళ్లు చేరిన ప్రాంతాల్లో ప్రజలు ప్రయాణాలు చేయకుండా పటిష్ట నియంత్రణ చేయాలని తెలిపారు. కొంతమంది. అత్యుత్సాహంతో ఎవరైనా దాటే ప్రయత్నం చేసే అవకాశం ఉన్నందున రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్ సిబ్బంది పటిష్ట పర్యవేక్షణలో బారికేడ్లు ఏర్పాటు చేసి రవాణా నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఈఈ ప్రసాద్, డిఈ వరుణ్, ఏఈ షర్ఫుఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# శాస్త్రోక్తంగా గోపూజ

**శ్రీశైలం, ప్రజాస్వరం**

కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవస్థానం శనివారం రోజు ఉదయం ఆలయ ప్రాంగణంలోని శ్రీగోకులంలో గోపూజను నిర్వహించింది.ప్రతినిత్యం ఆలయంలో ప్రాతకాల సమయంలో నిత్య సేవగా గోపూజనిర్వహించబడుతున్నప్పటికీ, కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం రోజు నిత్యసేవతో పాటు విశేషంగా గోపూజ జరిపించబడింది. శాస్త్రోక్తంగా జరుపబడిన ఈ గోపూజలో ముందుగా ఆలయప్రాంగణంలోని గోకులములో గోవులకు, గోవత్సాలకు (ఆవు దూడలకు) పూజాదికాలు జరిపించబడ్డాయి.ఈ విశేష కార్యక్రమములో ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు, వేదపండితులు పూజాసంకల్పాన్నిపఠించారు.ఈ సంకల్పములో సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, అతివృష్టి, అనావృష్టి నివారించబడాలని, పాడిపంటలతో దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అగ్నిప్రమాదాలు, వాహనప్రమాదాలు మొదలైనవి నిరోధించబడాలని, అందరికి శ్రేయస్సు కలగాలని చెప్పబడింది.ఆ తరువాత పూజాదికాలు నిర్విఘ్నంగా జరిగేందుకుగాను ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది.ఉపచారాలతో అనంతరం శ్రీసూక్తంతోనూ, గో అష్టోత్తరమంత్రంతోనూ, గోవులకు షోడశ పూజాదికాలు జరిపించబడ్డాయి. చివరగా గోవులకు నివేదన, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించబడ్డాయి.తరువాత దేవస్థాన గో సంరక్షణశాలలో కూడా శ్రీకృష్ణుని పూజ, గో పూజ జరిపించబడ్డాయి.మన వేదసంస్కృతిలో గోవుకు ఎంతో విశేషస్థానం ఉంది. మన వేదాలు ఉపనిషత్తులు, శాస్త్రాలు, పురాణాలు మొదలైనవన్నీ కూడా గోపూజ ఫలితాన్ని విశేషంగా పేర్కొన్నాయి. గోవు సకల దేవతలకు ఆవాస స్థానం కావడం చేత గోవును పూజించడం వలన దేవతలందరినీ పూజించిన ఫలితం లభిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా గోపూజను ఆచరించడలన లోకం సుభిక్షంగా ఉంటుందని, శాస్త్రాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా జగన్మాత లలితాపరమేశ్వరి గోవురూపంలో భూమిపై సంచరిస్తుందని. చెప్పబడుతోంది.కాగా తాను చేసిన ప్రతిపనిలోనూ వైశిష్ట్యాన్ని బోధించిన శ్రీ కృష్ణపరమాత్మ ఆవుల మంద అధికంగా ఉన్న కారణంగా గోకులంగా పేరొందిన వ్రేపల్లెలో పెరిగి గోవులను కాసి, గోపాలునిగా పేరుగాంచి, గోవుయొక్క అనంత మహిమను లోకానికి తెలియజేశాడు. ఈ కారణంగానే గోకులాష్టమి రోజున గోవును పూజించడం సంప్రదాయం అయింది.ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావుదంపతులు, అర్చకస్వాములు, వేదపండితులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# మేడ్చల్ ఫెర్టిలిటీ సెంటర్ లో అక్రమాలు

**హైదరాబాద్, ఆగస్టు 16, (ప్రజాస్వరం)**

సికింద్రాబాద్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ దారుణాలు మరువకముందే మరో ఘటన మేడ్చల్ జిల్లాలో వెలుగు చూసింది. అక్రమ సరోగసీ వ్యవహారంలో మొత్తం ఏడుగురు మహిళలు, ఒక పురుషుడు మొత్తం 8 మంది కమర్షియల్ సరోగసీ, అక్రమ ఎగ్ ట్రేడింగ్ చేస్తూ శుక్రవారం పట్టుబడ్డారు. పేదింటి యువతులకు గేలం వేసి వారిని సరోగసీ, అండాల దానానికి ఒప్పించి, అందుకు ఖరీదు కట్టి జోరుగా దందా సాగిస్తున్నారు. తాజాగా ఈ వ్యవహారంలో మరికొన్ని సంచలనాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు 8 మందిని అరెస్టు చేసి, రిమాండ్ కి తరలించారు. ప్రధాన నిందితురాలు నర్రెద్దుల లక్ష్మిరెడ్డి అలియాస్ లక్ష్మి (45) ఏ1గా.. కుమారుడు నరేందర్ రెడ్డి (23) A2 నిందితులుగా ఉన్నారు. ఈ 8 మందిలో ఆరుగురు సరోగెంట్ తల్లుల చేత నిందితురాలు లక్ష్మ ప్రామెసరి బాండ్ రాయించుకుంది. పిల్లలను కని ఇచ్చే సరోగెంట్ తలులకు ఐదు నుంచి నాలుగు లక్షలు మాత్రమే ఇచ్చేలా ముందే నిందితురాలు లక్ష్మి వారితో ఒప్పందం కుదుర్చుకునేది. అయితే సరోగసి తల్లిదండ్రుల నుంచి మాత్రం 20 నుంచి 25 లక్షల రూపాయల వరకు లక్ష్మి వసూలు చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.గతంలో పిల్లల విక్రయాలు సరోగసి కేసులో లక్ష్మని ముంబై పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. అయినా తీరు మార్చుకోని లక్ష్మి మళ్లీ పాత పద్ధతిలోనే నేరాలకు పాల్పడుతుంది. జైలు నుంచి విడుదలైన తర్వాత తిరిగి హైదరాబాద్‌కు వచ్చిన లక్ష్మి ఆమె కుమారుడు, కూతురు తిరిగి అదే దందా కొనసాగిస్తున్నారు. పోలీసుల సోదాల్లో ఘటనా స్థలంలో ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు, గర్భాదారణ మందులు, హార్మోన్ ఇంజక్షన్లు భారీగా పట్టుబడ్డాయి. అలాగే పలు ఐవిఎఫ్ సెంటర్‌లకు వెళ్లిన దంపతుల వివరాలను ఏజెంట్ల ద్వారా లక్ష్మి సేకరిస్తున్నట్లు అక్కడి ఆధారలను బట్టి తెలుస్తుంది. లక్ష్మి ఇంట్లో హెగ్డే హాస్పిటల్ తో సహా అను టెస్ట్ ట్యూబ్ సెంటర్, ఈవీఎఫ్ ఐవిఎఫ్, ఫర్టి కేర్, శ్రీ ఫెర్టిలిటీ, అమూల్య ఫెర్టిలిటీ సెంటర్‌లకు సంబంధాలు ఉన్నట్లు ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఐవీఎఫ్ హాస్పిటల్స్ తో లక్ష్మికి ఉన్న సంబంధాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# జర్నలిస్టులందరికి ఇండ్ల స్థలాలు ఇప్పిస్తా

- **ఎమ్మెల్యే విజయరమణరావు**

**పెద్దపల్లి, ప్రజాస్వరం**



పెద్దపల్లి ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులుగా పనిచేస్తున్నా వర్కింగ్ జర్నలిస్టులందరికి విడుతల వారీగా ఇండ్ల స్థలాలను అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు హామీ ఇచ్చారు.శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రం, మండల పరిధిలో పని చేస్తున్న జర్నలిస్టులంతా కలిసి జేఏసీగా ఏర్పడి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వర్కింగ్ జర్నలిస్టుల జాబితాతో పాటుగా పెద్దపల్లి ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన సర్వేనెంబర్‌లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణరావు జర్నలిస్టుల ఇండ్ల స్థలాల పై సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టులు ఇండ్ల స్థలాల కోసం ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు పలు మార్లు వినతిపత్రాలు అందజేసినా పట్టాల పంపిణీకి మాత్రం నోచుకోలేదన్నారు. కానీ తమ ప్రజా ప్రభుత్వం, తాను జర్నలిస్టుల పట్ల సానుకూలంగా ఉన్నామన్నారు. పెద్దపల్లి ప్రాంత జర్నలిస్టులకు తప్పకుండా ఇండ్ల స్థలాలను ఇప్పిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో బొద్దుల గంగయ్యకు ఫోన్ చేసిన ఎమ్మెల్యే వారం రోజుల్లో పట్టణంలో ప్రభుత్వ భూములు ఎక్కడఉన్నాయో సర్వే నిర్వహించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. అలాగే పట్టణంలో భూమి ఉండి ఇండ్లు నిర్మించుకోవాలనుకునే జర్నలిస్టులకు సైతం ఇందిరమ్మ ఇండ్లు కేటాయించటంతో పాటు, ఇంటి నిర్మాణం కోసం తన వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులం దరూ ఐక్యంగా కలిసి జర్నలిస్టుల సంక్షేమం కోసం కలిసిరావటం సంతోషకరమైన విషయన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు జర్నలిస్టులు వారధిలాగాపనిచేస్తున్నారని, అటువంటి జర్నలిస్టుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఈకార్యక్రమంలో జర్నలిస్టుల జేఏసీ సభ్యులు కొట్టె సదానందం, బొల్లబత్తుల రాజేందర్, గుడ్ల శ్రీనివాస్, అంకరి ప్రకాశ్, కీర్తి రమేష్, కాల్వ రమేష్, తిర్రి తిరుపతిగౌడ్, పంది కుమార్, కొల్లూరి గోపాల్, బానాల రాజమల్లు, బెజ్జంకి నరేష్, ఎర్రోజు వేణుగోపాల్, శిలారపు కిషన్, కేతిరెడ్డి పవన్, జంజిరాల లక్ష్మణ్, తిర్రి శంకర్, కత్తెర్ల తిరుపతి, బిర్రు రంజిత్, మర్రి సతీష్‌రెడ్డి, తూర్పాటి శ్రీనివాస్, తిర్రి సుధాకార్, కత్తెర్ల చందర్, మధు, సాబీర్ పాషా, దుర్గం లక్ష్మణ్, వీరమల్ల విద్యాసాగర్ నాగిశెట్టి శ్రీనివాస్, రాంబాబు, కొయ్యడా తిరుపతి, వెంటకేష్, అంజి, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ కామర్స్ అక్రమాలపై కన్ను

**హైదరాబాద్, ఆగస్టు 16, (ప్రజాస్వరం)**




హాల్ మార్క్ మోసాలు, సర్టిఫైడ్ కానీ అసురక్షిత ఉత్పత్తులపై బీఐఎస్ అధికారులు మెరుపు దాడులు చేపట్టడంతో అక్రమార్కులు హడలిపోతున్నారు. ప్రముఖ ఈ కామర్స్ లాంటి ఫ్లికార్ట్ , అమెజాన్, మీషోలో జరుగుతున్న చీటింగ్‌లపై అధికారులు మెరుపు దాడులు చేస్తున్నారు. ఈ దాడులలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.. విజయవాడ బంగారం షాపులలో తనిఖీలు సందర్భంగా పలు మోసాలను గుర్తించారు అధికారులు. ప్రభుత్వం నుంచి బులియన్ అండ్ హోల్ సేల్ పేరుతో అనుమతి తీసుకొని మార్కెట్లో గోల్డ్ అండ్ డైమండ్ పేరుతో వ్యాపారాలను నిర్వహిస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో బట్టబయలైంది. కొన్ని షాపులలో బంగారు ఆభరణాలపై డమ్మీ నెంబర్లు, ఇతర ఐడి నెంబర్లతో ఉన్న హాల్ మార్క్‌ను గుర్తించారు.నాణ్యత గల బంగారు ఆభరణాలకు కేంద్ర ప్రభుత్వం హెచ్‌యూ ఐడీ నెంబర్ జారీ చేసి షాపు పేరుతో హాల్ మార్క్ ఇస్తుంది. వీటిని జువెలరీ షాపుల యజమానులు తాము విక్రయించే ఆభరణాలపై ముద్రించాల్సి ఉంటుంది. కానీ కొన్ని షాపులలో ఎటువంటి హాల్ మార్క్ లేకుండా ఉన్న ఆభరణాలను గుర్తించారు అధికారులు. దాంతో వాటిని సీజ్ చేశారు. నరసన్నపేటలోని మారుతి నగర్ జంక్షన్ వద్ద బీఎస్ఆర్ గోల్డ్ అండ్ డైమండ్ జువెలరీ షాప్‌లో బిఐఎస్ సంస్థ ఇటీవల తనిఖీలు నిర్వహించింది. షాపులలో హాల్ మార్క్ లేకుండా 1072, 450 గ్రాముల బంగారు ఆభరణాలు విక్రయించడానికి సిద్ధంగా ఉంచినట్లు అధికారులు కేసు నమోదు చేశారు..మరోవైపు ఈ కామర్స్ అక్రమాలపై డేగ కన్నువేశారు బీఐఎస్ అధికారులు. ఫ్లిప్‌కార్ట్ , ఈ కార్ట్, మీ షోలో చోటు చేసుకున్న అక్రమాలపై దృష్టి సారించారు. ఇటీవలే కృష్ణా జిల్లా గన్నవరం మండలం ముస్తాబాదులోని షోరూమ్ లపై ఆకస్మిక దాడులు నిర్వహించి ఎలక్ట్రానిక్స్, ఎల్‌ఈడీ బల్బులు, బొమ్మలు, టేబుల్ ఫ్యాన్లతో సహా పెద్ద మొత్తంలో వస్తువులను బీఎస్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వస్తువులకు బీఐఎస్ సర్టిఫికేషన్ గుర్తు లేకపోవడంతో బీఐఎస్ చట్టం, 2016 యొక్క సెక్షన్ 17ని ఉల్లంఘించినట్లు సంబంధిత వ్యాపార సంస్థలపై కేసులు నమోదు చేశారు...ప్రతి వస్తువులో నాణ్యతపై ప్రజలు ప్రత్యేక దృష్టిసారిస్తున్న క్రమంలో బీఐఎస్ సర్టిఫికేషన్‌కు ప్రాధాన్యత పెరిగింది. బీఐఎస్ సర్టిఫికెట్ ఉన్నట్లైతే ఉత్పత్తి నాణ్యతగా ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్రంలో ఉన్న ఎమ్ఎస్ఎమ్ఈలు గ్లోబల్‌గా ఎదగాలంటే బీఐఎస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. భారత ప్రమాణాల బ్యూరో (బీఐఎస్) సర్టిఫికెట్ ఉన్న ఉత్పత్తుల మార్కెటింగ్ ఈజీ అవుతోంది. ఇండియాలో స్టాండర్డ్స్ చేయాలంటే అది బీఐఎస్ మాత్రమే చేయాలి. ప్రోడక్ట్ తయారీ, నిల్వ, అమ్మకాలు చేయాలన్నా బీఐఎస్ సర్టిఫికేషన్ ఉండాలి. ఈ క్రమంలో ఇండియాలో 816 వస్తువులకు బీఐఎస్ సర్టిఫికేషన్ పొందేలా కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది.ఇతర దేశాలకు చెందిన వస్తువులు ఇండియాలో అమ్మాలన్నా ఈ సర్టిఫికేషన్ అవసరం ఉంటుంది. ఈక్రమంలో బీఐఎస్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఆన్‌లైన్ నాణ్యత నియంత్రణలో ఆ వస్తువు వివరాలు రెండుసార్లు కంటే ఎక్కువ కనిపించకపోతే.. ఎవరైనా బీఐఎస్ మార్క్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు అని విజయవాడ బీఐఎస్ డైరెక్టర్ ప్రేమ్ సంజని తెలిపారు.

# బిల్లుల ఆమోదంపై రాష్ట్రపతి, గవర్నర్లకు కోర్టులు గడువా

**న్యూఢిల్లీ ఆగస్టు 16, (ప్రజాస్వరం)**

శాసనసభలు ఆమోదించిన బిల్లులకు రాష్ట్రపతి, గవర్నర్లు ఆమోదముద్ర వేయడానికి కాల పరిమితి విధించే అధికారం న్యాయస్థానాలకు లేదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. ఈ విషయంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకుంటే, అది రాజ్యాంగపరమైన గందరగోళానికి దారితీస్తుందని తన అభిప్రాయాన్ని వెల్లడించింది. అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్లు నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వవచ్చా? అనే అంశంపై సుప్రీంకోర్టు జారీ చేసిన నోటీసులకు కేంద్రం ఈ మేరకు బదులిచ్చింది.బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి గడువు విధించడం ద్వారా రాష్ట్రపతి, గవర్నర్ల వంటి అత్యున్నత పదవుల గౌరవాన్ని తగ్గించినట్లు అవుతుందని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ రెండు పదవులు ప్రజాస్వామ్య పాలనలో ఉన్నత పదవులని పేర్కొంది. వారి అధికారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవడం సరైన విధానం కాదని తెలిపింది.ఒకవేళ వారి విధి నిర్వహణలో ఏవైనా లోపాలు తలెత్తితే, వాటిని న్యాయవ్యవస్థ జోక్యంతో కాకుండా రాజ్యాంగబద్ధమైన యంత్రాంగాల ద్వారానే సరిదిద్దాలని కేంద్రం సుప్రీంకోర్టుకు విన్నవించింది. ఈ రకమైన జోక్యం వల్ల కొన్ని అనవసర సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉందని తన అఫిడవిట్‌లో పేర్కొంది.

# డోస్ పెంచిన కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 16, (ప్రజాస్వరం)**



తెలంగాణ కాంగ్రెస్‌లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అంశం హాట్ టాపిక్‌గా మారింది. మంత్రివర్గ విస్తరణలో ఆయనకు నిరాశ ఎదురవడంతో అప్పటి నుంచి సీఎం రేవంత్‌పై అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. నిత్యం విమర్శలు చేస్తూ పొలిటికల్ హీట్ పెంచుతున్నారు. అటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం అధిష్ఠానం కోమటిరెడ్డికి మంత్రి పదవి ఇస్తామన్నది నిజమేనని చెప్పడం గమనార్హం. అయితే అధిష్ఠానం ఇచ్చిన హామీతో పాటు తన పనితనాన్ని చూసి మంత్రి పదవి ఇవ్వాలని కోమటిరెడ్డి చెబుతున్నారు. అన్నదమ్ముళ్లకు ఇద్దరికీ మంత్రి పదవి ఇస్తే ఏమవుతుందని ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో మరోసారి కోమటిరెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. పైసలు, నిధులు అన్నీ మీకేనా అంటూ రేవంత్ రెడ్డిని నిలదీశారు.యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎల్లగిరిలో జరిగిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహావిష్కరణ సభలో కోమటిరెడ్డి పాల్గొన్నారు. గత 20 నెలలుగా మునుగోడు నియోజకవర్గంలో రోడ్లు, భవనాల నిర్మాణాల కోసం ఒక్క రూపాయి కూడా నిధులు రాలేదని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. మంత్రిని వందసార్లు కలిసినా ఫలితం లేకపోయిందని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించక తప్పదన్నారు. ''పదవులు మీరే తీసుకుంటున్నారు.. నిధులు కూడా మీరే తీసుకుంటున్నారని అడగాలా వద్దా?'' అని రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. తాను ముఖ్యమంత్రిని కానీ, పార్టీని కానీ విమర్శించడం లేదని, మునుగోడు నియోజకవర్గానికి నిధులు రావడం లేదనే ఆవేదనతోనే ఈ వ్యాఖ్యలు చేస్తున్నానని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలోనే ఆయన పై వ్యాఖ్యలు చేశారు. ''వలిగొండచౌటుప్పల్ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఎందుకంటే కాంట్రాక్టర్లకు బిల్లులు రావడం లేదు. ఆ బిల్లులు ముఖ్యమంత్రి ఆదేశిస్తేనే వస్తాయి. అందుకే నేను ముఖ్యమంత్రిని ఉద్దేశించి పదవులు మీకే.. పైసలూ మీకేనా? అని అడిగాను'' అని రాజగోపాల్ రెడ్డి వివరించారుమంత్రి పదవి ఇవ్వడమనేది అధిష్ఠానం నిర్ణయమని రాజగోపాల్ రెడ్డి అన్నారు. పదవి రావలసి ఉంటే ఎవరూ ఆపలేరని వ్యాఖ్యానించారు. ఒకవేళ తనకు మంత్రి పదవి వస్తే మునుగోడు ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి నాయకులను ఎన్నుకోవాలని, ఎందుకంటే నియోజకవర్గ అభివృద్ధికి నిధుల కోసం వారితో కలిసి తాను పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

**రేవంత్ ఒక్క పైసా కూడా ఇవ్వడం లేదు**

గత కొన్ని నెలలుగా రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ కామెంట్స్ చేస్తున్నా కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను ఎందుకు అలాంటి కామెంట్స్ చేస్తున్నారో చెప్పుకొచ్చారు. తన నియోజకవర్గానికి కావాల్సిన నిధులు విడుదలలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. నిధులు లేక, పదవులు లేక ఏ చేయడానికి ఎమ్మెల్యేగా ఉన్నామంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఎల్లగిరిలో వల్లభ్‌భాయి పటేల్ విగ్రహావిష్కరణ సలో పాల్గొని రేవంత్ రెడ్డి డబ్బులు ఇవ్వడం లేదని ఆరోపించారు. వలిగొండ చౌటుప్పల్ రోడ్డు నిర్మాణ బిల్లు రావడం లేదని అందుకే కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదని ఆరోపించారు. దీనిపై మంత్రిని అడిగితే తన చేతుల్లో ఏమీ లేదని అంతా ముఖ్యమంత్రి చేతుల్లో ఉన్నట్టు చెబుతున్నారని అన్నారు.కాంగ్రెస్ పార్టీని కానీ ప్రభుత్వాన్ని కానీ విమర్శించం లేదని రాజగోపాల్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రోడ్లకు, బిల్డింగ్‌లకు నిధులు రావడం లేదని చెప్పుకొచ్చారు. ఎన్నిసార్లు మంత్రులను కలిసినా ప్రయోజనం లేదని వాపోయారు. ముఖ్యమంత్రి వద్ద మొరెట్టుకున్న ప్రయోజనం లేకుండా పోయిందని ఆరోపించారు. నిధులు ఇవ్వడం లేదని పదవులూ ఇవ్వడం లేదని అన్నారు. అందుకే ప్రజల తరఫున ప్రశ్నించాల్సి వస్తోందని వాపోయారు. అలాంటి టైంలో పదవులు, పైసల గురించి అడగాలా వద్దా అని నిలదీశారు. పదవులు గురించి అధినాయకత్వం చూసుకుంటుందని రాజగోపాల్ రెడ్డి అభిప్రాయపడ్డారు. వచ్చినప్పుడు అది కచ్చితంగా వస్తుందని ఎవరు ఆపినా ఆగదని అన్నారు. చేసిన పనులకు మాత్రం కచ్చితంగా డబ్బులు రాష్ట్ర ప్రభుత్వమే ఇవ్వాలని అన్నారు. అందుకే అడుగుతున్నానని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం మంచి నాయకులను ఎన్నుకోవాలని అప్పుడే నిధుల కోసం కొట్లాడేందుకు వీలు కలుగుతుందని అన్నారు.తనకు మంత్రి పదవి రాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడ్డుపడుతున్నారనే కోపంతో ఉన్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఈ మధ్య కాలంలో వ్యతిరేక గళం వినిపిస్తున్నారు. నేరుగా ముఖ్యమంత్రిని టార్గెట్ చేస్తున్నారు. పది పదిహేనేళ్లు తానే ముఖ్యమంత్రిని అని చెప్పుకున్న రేవంత్‌రెడ్డిని తప్పుపట్టారు. అక్కడి నుంచి మొదలైన ఈయన విమర్శలు ఇంకా కొనసాగుతున్నాయి. దీనిపై క్రమశిక్షణ సంఘానికి పలువురు ఫిర్యాదు చేశారు. ఆయనతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కూడా ప్రయత్నిస్తున్నట్టు మల్లు రవి ఈ మధ్య కాలంలో ప్రకటించారు. ఇంత జరుగుతున్నా తగ్గేదేలే అన్నట్టు రాజగోపాల్ రెడ్డి విమర్శలు కంటిన్యూ చేస్తున్నారు. ఇప్పుడు నేరుగా సీఎంను టార్గెట్ చేస్తున్న రాజగోపాల్ రెడ్డిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో అనే చర్చ కాంగ్రెస్‌లో నడుస్తోంది.



# అమీర్ ఖాన్, నాగార్జునను డామినేట్ చేసిన చిన్న నటుడు..

రజినీకాంత్ హీరోగా వచ్చిన కూలీపై ఉన్న అంచనాలు అన్నీ ఇన్నీ కావు. లోకేష్ డైరెక్షన్ కావడంతో పాటు నాగార్జున, అమీర్ ఖాన్, ఉపేంద్ర లాంటి స్టార్లు ఉండటంతో వాళ్ల పాత్రలు ఓ రేంజ్ లో ఉంటాయని అంతా అనుకున్నారు. కానీ ఇంత పెద్ద స్టార్ల కంటే ఓ కమెడియన్ బాగా హైలెట్ అయిపోయాడు. కూలీ చూసిన వారంతా అతని నటనకు ఫిదా అయిపోతున్నారు. నాగార్జున, అమీర్ ఖాన్, ఉపేంద్రల కంటే అతని పాత్రకే బాగా స్కోప్ దక్కింది. చాలా వేరియేషన్స్ ఉన్న పాత్ర. అతనే సౌబిన్ సాహిర్. మంజుమ్మల్ బాయ్స్ సినిమాతో తెలుగు వాళ్లకు పరిచయం అయ్యాడు. చిన్న సినిమాలతో కెరీర్ మొదలు పెట్టి స్టార్ యాక్టర్ గా మారాడు. మలయాళంలో పెద్ద హీరోల సినిమాల్లో కీలక పాత్రలు చేస్తూ చివరకు కూలీ మూవీలో విలన్ పాత్రను దక్కించుకున్నాడు. ఈ సినిమా కోసం ఎన్నో ఆఫర్లు రిజెక్ట్ చేశాడు. కొన్ని నెలల పాటు డేట్లు ఇచ్చేశాడు. చివరకు సినిమా రిలీజ్ అయ్యాక అతనికి మంచి బ్రేక్ దక్కింది. ఈ సినిమాలో అతని పాత్ర అందరికీ గుర్తుండిపోతుంది. ఒకానొక దశలో నాగార్జున కంటే ఎక్కువ విలనిజం చూపించింది ఇతనే. నాగార్జున కంటే మనోడు మొదటి నుంచి క్రూరమైన విలన్ గా కనిపించి మెప్పించాడు. క్రూరత్వం నింపుకున్న మనిషిగా అతని నటన అమోఘం. బురద పూసుకుని అతను నటించిన తీరు మామూలు విషయం కాదు. ఇలాంటి ఎక్స్ ప్రెషన్లు పలికిస్తూనే పాత్రలోని వేరియేషన్స్ ను థియేటర్లలో తన నటనతో పేలిపోయేలా చేశాడు. అందుకే అమీర్ ఖాన్, నాగార్జున, ఉపేంద్ర కంటే ఇతని గురించే ప్రేక్షకులు ఎక్కువ తెలుసుకుంటున్నారు. మొత్తానికి పెద్ద స్టార్లకు మించి ఇతని పాత్రకు గుర్తింపు రావడం అంటే అది తన ట్యాలెంట్ కు దక్కిన ఫలితమే.

# జూనియర్ ఎన్టీఆర్, విజయ్ లకు వాటితో భారీ దెబ్బ..!

- అనవసరంగా బడా స్టేట్ మెంట్లు
- అంచనాలు పెంచేస్తున్న హీరోలు
- అవే కొంప ముంచాయా..?



ఏ సినిమా హీరో అయినా ఓవర్ హైప్ ఇస్తే భారీ నష్టమే జరుగుతుంది. రూపాయి విలువ చేసే వస్తువుకు రూపాయి వరకే చెప్పాలి. కానీ దాని స్థాయికి మించి చెప్తే జనాలు ఓ స్థాయిలోనే ఓవర్ హైప్ తో వెళ్తారు. అప్పుడు రూపాయి విలువ కు మించి దాని స్థాయి ఉండదు కాబట్టి అది ఫ్లాప్ అవుతుంది. ఇప్పుడు సినిమాల విషయంలోనూ ఇదే జరుగుతోంది. ఒక సినిమా ఏ స్థాయి వరకు ఆడుతుందో దాంట్లో నటించిన హీరోలకు, డైరెక్టర్లు, నిర్మాతలకు తెలుసు. సినిమా రెడీ అయిపోయాక వాళ్లందరూ కచ్చితంగా ఫైనల్ ప్రింట్ చూస్తారు. అది ఏ స్థాయి సినిమానో వాళ్లకు తెలుసిపోతుంది. ఆ స్థాయి వరకు ప్రీ రిలీజ్ ఈవెంట్లలో వాళ్లు మాట్లాడితే బెటర్. అంతకు మించి ఊపేస్తా, కాల్చేస్తా అంటే ఫ్యాన్స్ కూడా ఆ స్థాయిలోనే అంచనాలు పెట్టేసుకుని మూవీకి వెళ్తారు.

దాంతో సినిమా బాగున్నా సరే వాళ్లు ఊహించుకున్నంత, హీరోలు చెప్పినంత లేదే అనే అసంతృప్తితో మూవీపై నెగెటివ్ టాక్ వచ్చేస్తుంది. అది చిరకు మూవీనే ముంచేస్తుంది. మొన్న విజయ్ దేవరకొండ, నిన్న జూనియర్ ఎన్టీఆర్ విషయాల్లో జరిగింది. ఇదే. కింగ్ డమ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో విజయ్ మాట్లాడుతూ.. ఈ సినిమాతో చాలా పెద్దోడినైపోతా అన్నట్టు హైప్ ఇచ్చాడు. చివరకు సినిమా చూసిన వాళ్లకు కంటెంట్ నచ్చినా విజయ్ ఇచ్చిన హైప్ కు తగ్గట్టు లేదనే కారణంతో మూవీకి డిజాస్టర్ టాక్ వచ్చింది. ఎన్టీఆర్ కూడా వార్2 ప్రీ రిలీజ్ ఈవెంట్ లో మాట్లాడుతూ భారీ హైప్ ఇచ్చాడు. బొమ్మ అదిరిపోయింది అంటూ కాలర్ ఎగరేశాడు. అదే అంచనాలతో మూవీకి వెళ్లిన ఫ్యాన్స్ కు ఆశించిన రేంజ్ లో లేదనే డిసప్పాయింట్ వచ్చింది. అందుకే మూవీ బాగున్నా అంచనాలకు తగ్గట్టు లేదనే అసంతృప్తి వల్ల నెగెటివ్ టాక్ వచ్చింది. వాస్తవానికి కింగ్ డమ్, వార్2 కంటెంట్ పరంగా బాగానే ఉన్నాయి. కానీ హీరోల బడా స్టేట్ మెంట్ల వల్ల ఫ్యాన్స్ భారీగా అంచనాలు పెట్టేసుకుని థియేటర్లకు వెళ్లి అసంతృప్తికి లోనవుతున్నారు. కాబట్టి ఇలాంటి స్టేట్ మెంట్లు మానుకుని..సినిమా చూసి ఎంజాయ్ చేస్తారు అన్న వరకు మాట్లాడితే బెటర్ అంటున్నారు ఫ్యాన్స్.

# పవన్ కన్మణి.. ఎంత అందంగా ఉందో!!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రం 'ఓజీ'. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ కళ్యాణ్ ఓజాస్ గంభీరగా గ్యాంగ్‌స్టర్ అవతార్‌లో కనిపించనున్న ఈ చిత్రంలో ప్రియాంక అరుల్ మోహన్ కథానాయికగా నటిస్తున్నారు. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఓజీ' సినిమా నుంచి ప్రియాంక అరుల్ మోహన్ ఫస్ట్ లుక్‌ను తాజాగా చిత్ర బృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో ఆమె కన్మణిని పాత్రలో అలరించనున్నారు. 'ఓజీ' రూపంలో ఓ భారీ యాక్షన్ చిత్రాన్ని వెండితెరపై చూడబోతున్నామనే హామీని ఇప్పటిదాకా విడుదలైన ప్రచార చిత్రాలు ఇచ్చాయి. తాజాగా విడుదలైన ప్రియాంక మోహన్ ఫస్ట్ లుక్ మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఒక పోస్టర్ దయ, బలం, నిశ్శబ్దాన్ని ప్రదర్శిస్తోంది. మరో పోస్టర్ ప్రశాంతత మరియు గృహ వాతావరణాన్ని సూచిస్తుంది. ఇప్పటికే విడుదలైన పవన్ కళ్యాణ్ పాత్రకు సంబంధించిన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభించింది. ఇప్పుడు ప్రియాంక అరుల్ మోహన్ ఫస్ట్ లుక్ కూడా కట్టిపడేస్తోంది. సుజీత్ యొక్క విస్ఫోటన కథనానికి భావోద్వేగ లోతును, ఆకర్షణను పవన్ కళ్యాణ్ మరియు ప్రియాంక అరుల్ మోహన్ జోడిస్తున్నారు. ప్రతి తుఫానుకు అవసరమైన ప్రశాంతత ప్రియాంక మోహన్ పాత్ర అని నిర్మాతలు అభివర్ణించారు. ఇటీవల విడుదలైన 'ఓజీ' మొదటి గీతం 'ఫైర్ స్టార్మ్'కు విశేష స్పందన లభించింది. ఇప్పుడు రెండవ గీతాన్ని విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. త్వరలో ప్రోమో విడుదల కానుంది. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్, ప్రియాంక అరుల్ మోహన్ తో పాటు ఇమ్రాన్ హష్మి, అర్జున్ దాస్, ప్రకాష్ రాజ్, శ్రియా రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. 2025లో అతిపెద్ద సినిమాటిక్ ఈవెంట్‌గా ఇది రూపుదిద్దుకుంటోంది. సంగీత సంచలనం ఎస్. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రాహకులుగా రవి కె చంద్రన్, మనోజ్ పరమహంస వ్యవహరిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఓజీ' చిత్రం సెప్టెంబర్ 25, 2025న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.

# నెలసరి సమయంలో 12 గంటల పర్యటన..



బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే అవుతుంది. ఎంట్రీ ఇచ్చిన అనతి కాలంలోనే నటిగా మంచి గుర్తింపు సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ ఇప్పటి వరకు నాలుగు జాతీయ అవార్డులను అందుకున్నారు. ప్రస్తుతం సినిమాలు, రాజకీయాలను సమతూకంగా కొనసాగిస్తోంది. 2024లో భాజపా తరపున హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించి, ఎంపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే సెలబ్రిటీ అయినా, రాజకీయ నాయకురాలు అయినా పీరియడ్స్ సమస్యలు మాత్రం తప్పవు. ఈ విషయం గురించి చాలా మంది బహిరంగంగా మాట్లాడటానికి ఇష్టపడరు. కానీ తాజాగా కంగనా రనౌత్ మాత్రం తన అనుభవాలను బహిర్గతం చేస్తూ మహిళల వాస్తవ పరిస్థితిని చెప్పుకొచ్చారు.

"సినిమా షూటింగ్‌ల్లో హీరోయిన్స్‌కి కారవాన్‌లు ఉంటాయి. అవుట్‌డోర్ షెడ్యూల్స్‌లో కూడా టీమ్ ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తుంది. పీరియడ్స్ సమయంలో విశ్రాంతి తీసుకునే అవకాశం ఉంటుంది. అవసరమైతే వేడి నీరు, వాష్‌రూమ్ ఫెసిలిటీస్ కూడా అందుబాటులో ఉంటాయి. దీంతో ఆ రోజులు కొంత సులభంగా గడుస్తాయి. కానీ రాజకీయ రంగం పూర్తిగా వేరు. పర్యటనల సమయంలో ఒక్కోసారి రోజుకు 12 గంటల పాటు ప్రయాణించాల్సి వస్తుంది. ఆ సందర్భంలో టాయిలెట్ సదుపాయం కూడా దొరకదు. ఇది నాకే కాదు.. ఇతర మహిళా ఎంపీలందరికీ ఉన్న సమస్యే. ఇది చిన్న ఇబ్బంది కాదు, పెద్ద విపత్తు తో పోల్చవచ్చు. దీన్ని వర్ణించడం కూడా చాలా కష్టం" అని ఆమె తెలిపారు. ప్రజెంట్ ఈ మాటలు వైరల్ అవుతున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999